



www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం


సామాన్యుడి అస్త్రం / తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

THURSDAY 28TH MAY 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 71 COST : 3\- KHAMMAM, TELANGANA

గురువారం 28 మే 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక : 71 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI



## పెరుగుతున్న ఎండల తీవ్రత

అప్రమత్తంగా ఉండాలని ప్రధాని సూచన ➢ 2వ పేజిలో..

# ప్రతీ గ్రామానికి టీ-ఫైబర్ నెట్

- అమెండెడ్ భారత్‌నెట్ కార్యక్రమం కింద అమలు.. రింగ్ ఆర్కిటెక్చర్ విధానంతో నిరంతర సేవలు
- కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో సీఎం వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్, మే 27రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి, ఇంటికి హై-స్పీడ్ ఇంటర్నెట్ అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం టీ-ఫైబర్ ప్రాజెక్టు వేగవంతంపై దృష్టి సారించింది. అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ (ఏబీపీ) కింద ఈ ప్రాజెక్టు ➢ మిగతా 2వ పేజిలో..





## అకాల వర్షంతో చల్లబడ్డ వాతావరణం

- పలు జిల్లాల్లో ఉరుములు, ఈదురుగాలుల వర్షం
- కల్లాల్లో తడిసిన ధాన్యంతో రైతుల ఆందోళన
- తక్షణమే ధాన్యం కొనుగోళ్లు చేయాలని డిమాండ్

హైదరాబాద్,మే27 భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రాష్ట్ర ప్రజలకు భారీ వర్షంఎండల నుంచి ఉపశమనం కలిగించినా, అన్నదాతలక మాత్రం కన్నీరు మిగిల్చింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి ➢ మిగతా 2వ పేజిలో..



## పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశం
- ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలన్న రేవంత్

హైదరాబాద్,మే27 వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులపై అలర్ట్‌గా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ప్రత్యేకంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు ➢ మిగతా 2వ పేజిలో..

## రూ.25,530 కోట్లతో సార్థక్-పీడీఎస్



**రేషన్ ఆహార ధాన్యాల తరలింపు భారం ఇక కేంద్రానిదే**

న్యూఢిల్లీ, మే 27: దేశంలోని 81.35 కోట్ల మందికి చవకగా ఆహారధాన్యాలు అందిస్తున్న ప్రజాపంపిణీ వ్యవస్థ(పీడీఎస్)ను ఆధునికీకరించే దిశగా కేంద్రం నడుం బిగించింది. ఈ మేరకు ప్రస్తుతం కొనసాగుతున్న రెండు పథకాలు.. 'ఆహారధాన్యాల పంపిణీలో ప్రభుత్వ సంస్థలకు సహకారం, రేషన్‌షాపు డీలర్ల మార్జిన్' (ఎన్ఎ?ఫఎ?సఎ), 'ప్రజాపంపిణీ వ్యవస్థ ఆధునికీకరణ, సంస్కరణలు' (స్మార్ట్ పీడీఎ?స)లను కలిపి సార్థక్-పీడీఎ?సగా రూపొందించింది. దీనిని రూ.25,530 కోట్ల నిధులతో 2031 వరకూ ఐదేళ్లపాటు అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదముద్ర వేసింది. ఈ వివరాల్ని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ విలేకర్లకు వెల్లడిస్తూ.. లబ్ధిదారుల ఎంపిక, ఆహారధాన్యాల పంపిణీ, రవాణా దూరాభారం తగ్గింపునకు చర్యలు ➢ మిగతా 2వ పేజిలో..



## అట్టహాసంగా టిడిపి మహానాడు ప్రారంభం

- పార్టీ జెండా అవిష్కరించిన సిఎం చంద్రబాబు
- పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళి
- హాజరైన పార్టీ ప్రముఖులు, పోలిట్ బ్యూరో సభ్యులు

➢ 2వ పేజిలో..



## ప్రధాని మోడీతో తమిళనాడు సిఎం విజయ్ భేటీ

- రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి ప్రధానికి సిఎం వినతి
- పలు అంశాలపై ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ,మే27 తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ఢిల్లీలో తొలిసారి జరుపుతున్న అధికారిక పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సేవతీర్థ్‌లో బుధవారంనాడు కలుసు కున్నారు. ఉభయులూ 25 నిమిషాల సేపు సమావేశమయ్యారు. తమిళనాడు సీఎం విజయ్ బుధవారం ప్రధాని మోదీతో భేటీలో పలు అంశాలు చర్చించారని సమాచారం. తొలుత దిల్లీలోని తమిళనాడు భవన్‌కు చేరుకున్న ➢ మిగతా 2వ పేజిలో..

# త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ

- ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి
- జీహెచ్‌ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు
- కెటిఆర్ సవాల్‌పైనా మరోమారు ఘాటు విమర్శలు
- మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి



హైదరాబాద్,మే27 రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేపడతామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. జూన్ చివరి నాటికి మరో లక్ష పూర్తవుతాయన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు చేశామని మంత్రి వివరించారు. సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో కలిసి పొంగులేటి మీడియా సమావేశం నిర్వహించారు. తొలిదశలో హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి అవసరమైన కార్యాచరణ కోసం క్షేత్రస్థాయిలోకి వెళ్లాం. 13 చోట్ల స్థలాలు పరిశీలించాం. జీహెచ్ఎంసీలో స్థలం కొరతతో 18వేల ఇళ్లే ఇచ్చాం. పేదల ఇళ్ల కోసం విలువైన ప్రభుత్వ భూములను కేటాయిస్తున్నాం. జీవనోపాధికి అనుగుణంగా ఉండే ప్రాంతాల్లో, నివాసయోగ్యమైన ప్రదేశాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తాం అని వివరించారు. పేదల ఆలోచనలు, సూచనలకు అనుగుణంగానే యుద్ధ ప్రాతిపదికన ఇళ్లు నిర్మిస్తాం. ఒక్క రూపాయి ఫీజు కూడా తీసుకోకుండా మహిళల పేరుమీద రిజిస్ట్రేషన్ న్ చేస్తాం. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పంపిణీ జరుగుతుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 10 ఇళ్లు కూడా నిర్మించలేదు. మా ప్రభుత్వం వచ్చాక ఒక్కో నియోజకవర్గానికి 3,500కు పైగా ఇళ్లు ఇచ్చాం. రెండో విడతలో 2వేల ఇళ్లు కేటాయిస్తాం అని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు, తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే ఎక్కువ కడితేనే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. లేదంటే ఎమ్మెల్యేగా కూడా పోటీ చేయనని పేర్కొన్నారు. మీకంటే ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే.. మీరు పోటీకి ➢ మిగతా 2వ పేజిలో..

## త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం

➢ మొదటి పేజీ తరువాయి

దూరంగా ఉంటారా? అంటూ కేటీఆర్‌ను పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. వీరిద్దరి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహానగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు నిరూపించినా.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు. మే 23వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఇందిరమ్మ పాలన అంటే ఏమిటో గ్రామాల్లోకి వెళ్లి ఆ ఇళు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుందని కేటీఆర్‌కు ఆయన స్పష్టం చేశారు. ఫామ్‌హౌస్‌లలో ఉంటే ఏం తెలుస్తుందంటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి చురకలంటించారు. అలాగే జూన్ 1వ తేదీన మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి నిన్న మొన్నటి వరకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిందని కేటీఆర్‌కు పొంగులేటి గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్‌కు పొంగులేటి స్పష్టం చేశారు. దాంతో మీరు ప్రత్యేకంగా రాజకీయ సన్యాసం తీసుకోనక్కర్లేదరటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి వ్యంగ్యంగా అన్నారు.

# అకాల వర్షంతో చల్లబడ్డ వాతావరణం

➢ మొదటి పేజీ తరువాయి

తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అకాల వర్షాలకు పలు కొనుగోలు కేంద్లా ధాన్యం తడిసిపోయింది. పలుచోట్ల చెట్లు విరిగిపోయాయి రవాణాకు అంతరాయం ఏర్పడింది. సంగారెడ్డిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. కామారెడ్డి జిల్లాలో వర్షాలకు కల్లాల్లోని ధాన్యం కొట్టుకుపోయింది. సిద్దిపేట జిల్లా ముత్యాలో అత్యధికంగా 12.3 సెం.మీ. వర్షపాతం నమోదయింది. మహబూబూనగర్ జిల్లా భూత్పూర్ మండలంలో 11 సెం.మీ., నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేటలో 8.4 సెం.మీ., నల్లగొండ జిల్లా గుండ్లపల్లిలో 6.2 సెం.మీ. వర్షం కురిసింది. సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పిడుగులు పడే అవకాశం ఉండటంతో వాతావరణ శాఖ ప్రజలను అప్రమత్తం చేసింది. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ధాన్యం తడిసిపోయి నష్టపోతున్నామని రైతులు ఆరోపించారు. డిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెక్కలు ముక్కలు చేసుకొని, అప్పులు జేసి ఇంటిల్లిపాది ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తే.. అన్నదాతలకు చివరకు కన్నీళ్లే మిగిలాయి. ప్రభుత్వ నిర్లక్ష్యంతో కాంటా పెట్టాల్సిన వడ్లు అకాల వర్షాలకు కండ్ల ముందే నీళ్లలో కొట్టుకుపోతుంటే రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. అష్టకష్టాలు పడి రైతులు కష్టాలను దిగమింగుకొని ధాన్యపు సిరులు పండించారు. పుట్లకొద్ది పండిస్తే ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా, ధాన్యం కొనుగోలు చేయకపోవడం, అరకొరా కొన్నా కాంటాలు పెట్టకపోవడం, నెలల తరబడి గన్నీ సంచులు అందక, మద్దతు ధర లభించక, తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ, తీరా కాంటాలు పెట్టాక లారీల కొరతతో లోడింగ్ చేయకపోవడంతో కల్లాల్లోనే ధాన్యం పంటలు తడిసి ముద్దయ్యింది. సకాలంలో కొనుగోలు చేసి ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. మెదక్ జిల్లాలో ఈదురు గాలులు బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి నుంచి ఈదురు గాలులతో భారీ వర్షం పడడంతో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం వర్షానికి తడిసిపోయింది. ఈదురు గాలులు భారీగా వీచడంతో చెట్లు కరెంటు స్తంభాలు కూలిపోయాయి. మెదక్ జిల్లాలోని మెదక్, హవేలీ ఘనాపూర్, పాపన్నపేట, కుల్చారం, కౌడిపల్లి, చిలిపిచెడ్, చిన్న శంకరంపేట్, రామాయంపేట, చేగుంట తో పాటు పలు మండలాల్లో కల్లాల్లోని ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో దాన్యం బస్తాలు తడిచిపోవడంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొని ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. కొన్నిచోట్ల వడ్ల కుప్పలు ఉండగా మరికొన్ని చోట్ల వరి ధాన్యం బస్తాలో నింపించారు. కాంటజేసిన లారీలు సకాలంలో రాకపోవడంతో ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రాలలో నిలువ చేశారు. అకాల వర్షానికి వరి ధాన్యం తడిచిపోవడంతో తమకు తీవ్ర నష్టం జరిగిందని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు.

## శ్రీ పద్మనాభస్వామి ఆలయంలో బంగారం, వజ్రాల ఆభరణాలు అదృశ్యం..

కేరళ: తిరువనంతపురంలోని ప్రసిద్ధ శ్రీ పద్మనాభస్వామి ఆలయంలో బంగారం, వజ్రాల ఆభరణాలు అదృశ్యం కావడం సంచలనం సృష్టిస్తోంది. ఈ విషయాన్ని సాక్షాత్తూ కేరళ డీజీపీ వెల్లడించడంతో ఆలయ భద్రతపై భక్తుల్లో అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. స్వామివారి ఆభరణాలు కనిపించకుండా పోయాయని కేరళ హోం శాఖ సెక్రటరీకి డీజీపీ సమర్పించిన నివేదిక చర్చనీయాంశమైంది. డీజీపీ నివేదిక ప్రకారం.. ఆలయం నుంచి సుమారు 78 గ్రాముల బంగారు, వజ్రాల ఆభరణాలు అదృశ్యమయ్యాయి. వాటిలో వైరమ్ నామంగా పిలువబడే వజ్రాల ఆభరణం కూడా ఉంది. అధికారిక రికార్డుల ప్రకారం వైరమ్ నామాన్ని మరమ్మతుల కోసం కొన్ని నెలల కిందట ఆలయం నుంచి బయటకు తీసుకెళ్లారు. కానీ, ఆ తర్వాత దానిని తిరిగి తీసుకురాలేదు. అదే విధంగా ఆరు నెలల కిందట ఆలయం నుంచి తీసుకెళ్లిన బంగారు దీపం కూడా కనిపించకుండా పోయింది. దీంతో ప్రస్తుతం ఉన్న భద్రతా ఏర్పాట్లపై డీజీపీ ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టి భద్రతను పటిష్ఠం చేయాలని హోం శాఖ సెక్రటరీని కోరారు. ఈ సందర్భంగా స్వామివారి విలువైన ఆభరణాల నిర్వహణపై డీజీపీ పలు కీలక సూచనలు చేశారు. అన్ని బంగారు, వెండి వస్తువులను సురక్షిత ఖజానాలకు తరలించాలని నివేదికలో పేర్కొన్నారు. సరైన తనిఖీ లేకుండా ఏ వ్యక్తినీ లోపలికి అనుమతించకుండా పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల కానుకలను ప్రత్యేక లాకర్లలో భద్రపరచాలనీ సూచించారు. మరోవైపు స్వామివారి ఆభరణాలు అదృశ్యం కావడంపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీ పద్మనాభ స్వామివారి శతాబ్దాల నాటి సంపద నిర్వహణలో నిర్లక్ష్యంపై ఆగ్రహిస్తున్నారు.

# పెరుగుతున్న ఎండల తీవ్రత

### అప్రమత్తంగా ఉండాలని ప్రధాని సూచన

న్యూఢిల్లీ,మే27: దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజలకు ఓ కీలక విజ్ఞప్తి చేశారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రత పెరుగుతోందని పేర్కొన్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు రోజువారీ జీవితంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధాని పోస్టు పెట్టారు. ముఖ్యంగా శరీరం డీహైడ్రేట్‌కు గురికాకుండా చూసుకోవాలని, బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా తాగునీటిని వెంట తీసుకెళ్లాలని సూచించారు. ఎండ తీవ్రత ఉన్న సమయాల్లో అవసరం లేకుండా బయట తిరగకూడదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దాహంతో ఉన్న వారికి ఒక గ్లాస్ నీరు అందించాలని, ఇళ్ల ముందు, దుకాణాల బయట మట్టికుండల్లో తాగునీరు ఏర్పాటు చేయాలని కోరారు. ఇతరులకు తాగునీరు అందించే వారిని అభినందిస్తున్నానని ప్రధాని పేర్కొన్నారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రధాని మోదీ సూచించారు.

# పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

➢ మొదటి పేజీ తరువాయి

తలెత్తకుండా అదనపు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. కల్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుంచి టార్పాలిన్లను ఇతర అవసరమైన ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. రైతుల ధాన్యం భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే వాతావరణ కేంద్రం బలమైన ఈదురుగాలుల హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు వెంటనే స్పందించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

# ప్రధాని మోడీతో తమిళనాడు సీఎం విజయ్ భేటీ

➢ మొదటి పేజీ తరువాయి

విజయ్.. అనంతరం ప్రధాని కార్యాలయానికి వెళ్లి మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం అయ్యాక ఆయన తొలిసారి ప్రధానితో సమావేశమయ్యారు. దాదాపు 25 నిమిషాలపాటు సాగిన ఈ భేటీలో.. తమిళనాడుకు సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించినట్లు తెలుస్తోంది. తమిళనాడుకు కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సాయంతో పాటు పలు అంశాలు చర్చించినట్లు తెలుస్తోంది. అనంతరం ఇరువురు నేతలు కలిసిన సందర్భంగా తీసిన ఫొటోలను పీఎంవో 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. ఇటీవల నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా 'అనైమంగళం' రాగి శాసనాలను తిరిగి భారత్‌కు రప్పించడంలో ప్రధాని మోదీ చేసిన కృషికి సీఎం విజయ్ కృతజ్ఞతలు తెలిపారని పేర్కొంటూ తమిళనాడు ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. మేకెదాటు డ్యామ్ వివాదం అంశంపైనా ప్రధానితో చర్చించినట్లు పేర్కొంది. తమిళనాడు మత్స్యకారులను శ్రీలంక నౌకాదళం అరెస్టు చేయడం, వేధించడం వంటి ఘటనలు పెరుగుతుండటంపై సీఎం ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపింది. ఈ ఏడాదిలోనే 12 అరెస్టులు నమోదయ్యాయని, ప్రస్తుతం 58 మంది మత్స్యకారులు శ్రీలంక నిర్బంధంలో ఉన్నారని ప్రధాని దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించింది. మత్స్యకారులను, వారి పడవలను తక్షణమే విడుదల చేయాలని శ్రీలంక ప్రభుత్వాన్ని కోరాల్సిందిగా అభ్యర్థించినట్లు పేర్కొంది. అనంతరం ఆయన నేరుగా తమిళనాడు హౌస్‌కు చేరుకోవడంతో గౌరవ వందనంతో ఆయనకు సాదర స్వాగతం లభించింది. తమిళనాడు సీఎంగా విజయ్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఢిల్లీకి రావడం ఇదే ప్రథమం. విజయ్ తన పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా కలుసుకోనున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను 10 జన్‌పథ్‌లో కలుసుకోనున్నారు. విజయ్ సమావేశం నేపథ్యంలో జన్‌పథ్ వెలుపల రాహుల్-విజయ్ ఫోస్టర్లు వెలిసాయి. కాగా, వామపక్షాలు, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ పార్టీల నేతలు కూడా తమిళనాడు హౌస్‌లో విజయ్‌ను కలుసుకోనున్నారు.

## కొనసాగుతున్న సరస్వతీ పుష్కరాలు

### వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులు

కాళేశ్వరం,మే27కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలకు భక్తులు పోటెత్తుతున్నారు. పుష్కరఘాట్‌ల వద్ద తెల్లవారు జాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో చేరుకుని పవిత్ర స్నానాలు ఆచరించారు. వేద మంత్రోచ్ఛరణలు, హారతులు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో కాళేశ్వర క్షేత్రం మార్మోగుతోంది. ఈ నెల 21న ప్రారంభం అయిన పుష్కరాల్లో భక్తులు వివిధ ప్రాంతాల న ఉంచి వచ్చి నదీ స్నానం ఆరిస్తున్నారు. ఈ పుష్కర పుణ్య స్నానాలకు తెలంగాణ రాష్ట్రంలోని నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి మహాస్వామి హాజరై పుష్కరఘాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు అందించి, పుష్కరాల ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను గురిం చి వివరించారు. అలాగే దేవాదాయ కమిషనర్ హనుమంతరావు హాజరై పుష్కర స్నానం ఆచరించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. పుష్కరాల సందర్భంగా శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో సకల ఐశ్వర్య ప్రాసస్థ్యం దుర్గ సూక్త హోమం అత్యంత వైభవంగా జరిగింది. పండితులు వేద మంత్రాల నడుమ హోమ క్రతువులను నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూర్ణాహుతి సమర్పించారు. ఆర్టీసీ సంస్థ సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన బాహుబలి సెట్టింగ్‌ను చూసి మురిసిపో యిన భక్తులు సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు. సరస్వతి పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సరస్వతి మాత, శివుని విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. అలాగే పిల్లలు ఆడు కోవడానికి ఇక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పిల్లాపాపలతో వచ్చిన భక్తులు ఆహ్లాదాన్ని పొందుతున్నారు.

## ప్రతీ గ్రామానికి టీ-ఫైబర్ నెట్

➢ మొదటి పేజీ తరువాయి

అమలు చేయాలని అనుకుంటుంది. ఇందుకు సంబంధించి కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సహా ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఏబీపీ అమలు ప్రక్రియను సజావుగా ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకువెళ్లారు. ముఖ్యంగా కేంద్రంతో ఒప్పందాన్ని త్వరగా కుదుర్చుకోవడం, పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదల వేగవంతంపై మాట్లాడారు. అలాగే మండలం నుంచి గ్రామ పంచాయతీ స్థాయిలో ఉన్న రింగ్ నెట్‌వర్క్ ఆస్తులను డిజిటల్ భారత్ నిధికి బదిలీ చ్టసే విషయంలో స్పష్టమైన విధానం అవసరమని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి సింధియా రాష్ట్రానికి అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కాగా, ఈ ప్రాజెక్టులో రింగ్ ఆర్కిటెక్చర్ విధానాన్ని అమలు చేయడం ద్వారా ఒక మార్గంలో అంతరాయం ఏర్పడినా ప్రత్యామ్నాయ మార్గం ద్వార్శ్రసవలు నిరంతరం కొనసాగించేలా వ్యవస్థను రూపుదిద్దుతున్నారు. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కూడా నిరంతర హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్శ్రసవలు అందుబాటులోకి రానున్నాయి. మొదటి దశలో ఉమ్మడి నిజామాబాద్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లో నెట్‌వర్క్ దెబ్బతిన్న 3,089 గ్రామాలకు డిజిటల్ కనెక్టివిటీ పునరుద్ధరణ చేపట్టనున్నారు.

ఈ క్రమంలో టీ-ఫైబర్ అమలుకు స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. టీఫైబర్ ప్రాజెక్ట్ విస్తరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఇప్పటివరకు రూ.3721.60 కోట్లు ఖర్చు చేశారు. అయితే ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్రం పలు అంశాలపై సూచనలు, అభ్యంతరాలు వ్యక్తం చేయగా.. రాష్ట్రం కేంద్రానికి పలు విజ్ఞప్తులు చేసినట్లు తెలుస్తోంది. అందులో బీఎ?సఎన్ఎల్ పెండింగ్ బిల్లులు రూ. 121 కోట్లుండగా.. రూ.20 కోట్లను విడుదల చేసింది. మరొక రూ.20 కోట్లు త్వరలో విడుదల చేస్తామని హామీ ఇచ్చింది. బారత్ నెట్ రెండో దశకు సంబంధించి రూ. 204 కోట్ల నిధుల విడుదల వారంలోపు జరుగుతుందని కేంద్రం స్పష్టం చేసినట్లు తెలిసింది. కేంద్ర టెలికమ్యూనికేషన్ల శాఖ, ఏబీపీ మార్గదర్శకాల ప్రకారం రూ.997.17 కోట్ల విలువైన రింగ్ నెట్‌వర్క్‌కు సంబంధించిన ఆస్తులు డిజిటల్ భారత్ నిధికి ఉన్నది ఉన్నట్లు బదిలీ చేయాలి. అయితే ఈ ఆస్తులను రాష్ట్ర ప్రభుత్వం రుణం తీసుకుని నిర్మించిందని, ఈ మొత్తాన్ని రాష్ట్రానికి తిరిగి చెల్లించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. పెండింగ్‌లో ఉన్న వివిధ అంశాలకు సంబంధించిన రూ.260.94 కోట్లను విడుదల చేయాలని కేంద్రాన్ని కోరినట్లు సమాచారం.

### రాజాసాబ్.. రెడ్డి సాబ్..!!

వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి జ్యోతిరాధిత్య మధ్య సరదా సంభాషణ జరిగింది. కాన్ఫరెన్స్ ప్రారంభమవగానే..రేవంత్ మాట్లాడుతూ.. "రాజాసాబ్.. స్మార్ట్ దికరాయె ఆప్" (స్మార్ట్‌గా కనిపిస్తున్నారు) అని సరదాగా అన్నారు. ఇందుకు స్పందించిన కేంద్రమంత్రి సింథియా "హా.. రోజు రన్నింగ్ చేస్తా"నంటూనే.. ' రెడ్డి సాబ్... 'ఆప్ బి ఫిట్ దికరాయె" (మీరు కూడా ఫిట్‌గా ఉన్నారు) అని నవ్వుతూ అన్నారని తెలిసింది

### ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు : సీఎం రేవంత్

త్యాగనిరతి, దైవభక్తికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ (ఈద్ ఉల్ అజ్హా) పండుగ సందర్భంగా ముస్లింలకు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం చేయడానికి సిద్ధపడిన గొప్ప సంఘటనను స్మరిస్తూ ప్రపంచ వ్యాప్తంగా ముని?ంలలు ఈ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని సీఎం గుర్తుచేశారు. బక్రీద్ పండుగ మనిషికి త్యాగం, దాతృత్వం, విశ్వాసం, మానవత్వం వంటి గొప్ప విలువలను గురు ?తచేస్తుందని అన్నారు. జీవితంలో ఎలాంటి కష్టాలు ఎదురైనా దేవుడిపై నమ్మకంతో సన్మార్గంలో ముందుకు సాగాలనే సందేశాన్ని బక్రీద్ అందిస్తోందని తెలిపారు. తమకు ఉన్నదాంట్లో కొంతైనా అవసరమైన వారికి పంచిపెట్టడంకన్నా గొప్ప దానం మరొకటి లేదనే స్ఫూర్తిని బక్రీద్ చాటిచెబుతోందని పేర్కొన్నారు.

## రూ.25,530 కోట్లతో సార్థక్-పీడీఎస్

వంటివన్నీ వచ్చే ఐదేళ్లపాటు సార్థక్-పీడీఎస్ కిందనే అమలవుతాయని తెలిపారు. రాష్ట్రాల్లో రేషన్‌షాపులకు ఆహారధాన్యాలను తరలించటానికి అవసరమవుతున్న రవాణా వ్యయం రాష్ట్ర ప్రభుత్వాలకు భారంగా పరిణమిస్తున్న నేపథ్యంలో.. ఇకపై ఈ వ్యయాన్ని సార్థక్-పీడీఎస్ భరించనుందని వెల్లడించారు. రేషన్‌షాపు డీలర్ల కమిషన్‌ను కూడా పెంచుతామని చెప్పారు.

# అట్టహాసంగా టిడిపి మహానాడు ప్రారంభం

అమరావతి,మే27 తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు-2026 వేడుకలు అమరావతిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుకుని మహానాడు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. టీడీపీ జెండాను ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ సీఎం నందమూరి తారక రామారావుకు నివాళులు అర్పించారు. ఈసారి మహానాడును పూర్తిగా సాంకేతికత ఆధారంగా వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్లలో 1851 క్లస్టర్లను పార్టీ కేంద్ర కార్యాలయంతో అనుసంధానం చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి ఒక క్లస్టర్‌ను ఙలినీ-చిజా కమ్యూనికేషన్ సిస్టమ్ ద్వారా నేరుగా అనుసంధానిస్తూ నాయకులు, కార్యకర్తలతో మమేకం కానున్నారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రతి క్లస్టర్‌లో భారీ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మహానాడు ప్రత్యేకంగా 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహిస్తున్నారు. మహిళా సాధికారత, పార్టీ నిర్మాణంలో మహిళల పాత్ర, సామాజిక సేవలో మహిళల భాగస్వామ్యంపై ప్రధానంగా చర్చలు జరగనున్నాయి. అదేవిధంగా 'కార్యకర్తే అధినేత, యువగళం, పేదల సేవలో టీడీపీ' వంటి అంశాలపై కూడా కీలక చర్చలు జరుగనున్నాయి. మహానాడులో మొత్తం 10 కీలక తీర్మానాలపై చర్చించి ఆమోదం తెలపనున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయానికి పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ, రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు, పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు. ఇప్పటికే మహానాడు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన పార్టీ శ్రేణులు, పసుపు జెండాలతో కేంద్ర కార్యాలయాన్ని అలంకరించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ మహాసభలను పార్టీ శ్రేణులు 'పసుపు పండుగ'గా అభివర్ణిస్తున్నాయి. ఉదయం 10:40 గంటలకు చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ ప్రారంభ ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ప్రసంగించారు. రాబోయే రాజకీయ వ్యూహాలు, ప్రభుత్వ పనితీరు, పార్టీ బలోపేతం, యువత, మహిళల పాత్రపై పలవురు నేతలు కీలక సందేశాలు ఇచ్చారు. మహానాడు-2026 ద్వారా పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశర ఇవ్వడంతో పాటు, గ్రామస్థాయి కార్యకర్తలతో ప్రత్యక్ష అనుసంధానం పెంచడంపై టీడీపీ హై కమాండ్ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

## కుషాయిగూడ పోలీస్ స్టేషన్ లో బాల్క సుమన్‌పై ఫిర్యాదు

- టీపీసీసీ జాయింట్ కన్వీనర్ రామిళ్ళ రాధిక.



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ మే 27/ అక్షరం న్యూస్ –:

మంచిర్యాల జిల్లా రాజకీయాల్లో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. “మన పిల్లలు మిలిటెంట్లు కావాలి” అంటూ ప్రజలను ప్రేరేపించేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ఆయనపై బుధవారం కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టి పి సి సి జాయింట్ కన్వీనర్ రామిల్ల రాధిక మాట్లాడుతూ బాల్క సుమన్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజా నిరసనలను అణచివేసి, నిరసన తెలిపిన వారిపై కేసులు నమోదు చేయించారని ఆరోపించారు. బెల్ట్ షాపుల వ్యతిరేకంగా పోరాడిన మహిళలను కూడా పోలీస్ కేసుల్లో ఇరికించి రిమాండ్‌కు పంపించారని విమర్శించారు. ఇలాంటి వ్యక్తి మళ్లీ ప్రజా ప్రతినిధిగా కొనసాగకూడదని, ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ఈ మేరకు కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఎస్ హెచ్ ఓ కు ఫిర్యాదు చేసి, అక్నాలెడ్జ్‌మెంట్ స్వీకరించినట్లు తెలిపారు. బాల్క సుమన్‌పై కఠిన చర్యలు తీసుకుని, ప్రజా జీవితంలో కొనసాగకుండా అనర్హత వేటు వేయాలని ప్రభుత్వాన్ని, ఎన్నికల అధికారులను వారు డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని గౌరవించే ప్రజలు ఇలాంటి వ్యాఖ్యలను సహించరని పేర్కొంటూ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

## మహిళా సమాఖ్య భవనానికి భూమి పూజ



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ మే 27/ అక్షరం న్యూస్ –:

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాలకు స్వంత భవనాలను భూమి పూజ చేసిన నేపథ్యంలో మందమర్రి మండలంలోని సారంగపెల్లి గ్రామపంచాయతీ మహిళా సంఘాలకు కేటాయించిన భవనానికి బుధవారం మండల అభివృద్ధి అధికారి రాజేశ్వర్, గ్రామ సర్పంచ్ బచ్చలి రాములు గారి చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కడారి జీవన్ గ్రామపంచాయతీ కార్యదర్శి సవ్య,గ్రామ ఉప సర్పంచ్ ఎంబడి సతీష్,వార్డు మెంబర్లు కాసర్ల సురేష్, మంద సువర్ణ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కమల మనోహర్ రావు, మోకీద్, లింగయ్య,రామగిరి కుమారస్వామి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజానాట్యమండలి రాష్ట్ర సమితి సభ్యునిగా గడ్డం రమేష్



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ మే 27/ అక్షరం న్యూస్

తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర సమితి సభ్యుడిగా గడ్డం రమేష్ ను ఎన్నుకున్నారు. తెలంగాణ ప్రజానాట్యమండలి 4వ రాష్ట్ర మహాసభలు మే 25 26న హైదరాబాదులోని బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ భవనంలో చాలా ఘనంగా నిర్వహించి రాష్ట్ర సమితిని ప్రకటించారు. తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర సమితి సభ్యుడిగా నియమితులైన అనంతరం గడ్డం రమేష్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్యమండలి కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నందుకు పార్టీ రాష్ట్ర నాయకత్వానికి ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది

- ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యా బోధన.
- తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి.



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ మే 27/ అక్షరం న్యూస్ –:

తెలంగాణలో విద్యాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతిస్తుందని తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం మందమర్రి పట్టణంలోని శ్రీ కన్వెన్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖ తన వద్ద ఉంచుకొని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. విద్యార్థులే దేశ ప్రగతికి మూల స్తంభాలనీ విద్యతోనే విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. సిరి సంపదలు ఎన్ని ఉన్నా చదువు లేకపోతే అవి అన్ని సున్నా అని విద్యతోనే విజ్ఞానం విషయ పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. చెన్నూరు నియోజకవర్గంలో విద్య వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాననీ కోటపల్లి మండలంలోని సోమనపల్లి వద్ద 200 కోట్లతో ఇంటిగ్రేట్ స్కూల్ నిర్మాణం జరుగుతుందన్నారు. మందమర్రిలో అడ్వాన్స్ టెక్నాలజీ చెన్నూరులో కూడా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశానన్నారు. ఉపాధ్యాయుల పనితీరు వల్లే మంచి ఫలితాలు వస్తున్నాయి. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు వ యూ ల స్తంభాలాంటివారన్నారు. విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో పాఠశాలలకు బెంచీలు ఆర్వో ప్లాంట్లు అందజేశామని కొన్ని పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంటే ప్రైవేటు ఉపాధ్యాయులను నియమించి వేతనాలు కూడా ఇచ్చామన్నారు.2025 - 26 విద్యా సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా 95. 15 శాతం ఫలితాలు రావడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులకు ప్రోత్సాహంగా దివంగత ప్రొఫెసర్ జి లింగరాజు స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. గత సంవత్సరం కూడా ఆ సమస్త ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీకి తాను హాజరయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఈవో యాదయ్య, ఎంఈఓ రాథోడ్ రమేష్, మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు ఎమ్మార్వో పనకంటి సతీష్ కుమార్ శర్మ, మంచిర్యాల డిసిసి అధ్యక్షుడు పిన్నింటి రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతికా సమ్మర్ క్యాంప్ ప్రారంభం





- జ్యోతికా క్లబ్, మూవీ క్లబ్ లోగోలను ఆవిష్కరించిన ఎన్‌టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత

జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 27 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎన్‌టీపీసీ జ్యోతికా ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జ్యోతికా వెల్ఫేర్ అసోసియేషన్ సమ్మర్ క్యాంప్‌ను బుధవారం ఎన్‌టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతికా క్లబ్, మూవీ క్లబ్‌లకు సంబంధించిన లోగోలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన బిలియర్డ్స్ సౌకర్యాన్ని కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంతో జ్యోతికా ప్రాంగణం సందడిగా మారింది. వివిధ కార్మిక సంఘాల నాయకులు, నీర్ ప్రతినిధులు, అసోసియేషన్ ప్రతినిధులు, జ్యోతికా సభ్యులు, చిన్నారులు, కోచ్‌లు మరియు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

సమ్మర్ క్యాంప్ ద్వారా పిల్లల్లో క్రీడా స్ఫూర్తి, సృజనాత్మకత మరియు సామాజిక చైతన్యం పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు ఈ కార్యక్రమంలో ఈజీఎం హెచ్‌ఆర్ సాగర్ రంజాన్ సాహూ యూనియన్ నేత భాస్కర్ రెడ్డి జ్యోతిక ప్రధాన కార్యదర్శి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

JYOTHIKA WELFARE ASSOCIATION NTPC RAMAGUNDAM

## భారతి దేహదానం పలువురికి ఆదర్శనీయం’

- తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ అభినందన.



మందమర్రి/మే 27/ అక్షరం న్యూస్ –:

రెండు కళ్ళను, పార్థివ దేహాన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలకు దానం చేసి అమరజీవి చెర్లపల్లి భారతి ఎందరికో ఆదర్శంగా నిలిచారని రాష్ట్ర కార్మిక ఉపాధి శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. అనారోగ్యంతో ఈ నెల 21 న మందమర్రి అంగడిబజార్ ఏరియాలో మృతి చెందిన భారతి కుటుంబ సభ్యులను ఇంటికి వెళ్ళి మంత్రి బుధవారం పరామర్శించారు. భారతీ చిత్రపటానికి పువ్వులు వేసి నివాళులు అర్పించారు. మృతురాలు భారతి కోరిక మేరకు తన భౌతిక కాయాన్ని కరీంనగర్ ప్రభుత్వ వైద్య కళాశాలకు అప్పగించిన కుటుంబ సభ్యులను మంత్రి వివేక్ అభినందించారు. మంత్రి వివేక్ తో పాటు భారతి ఇంటికి వెళ్ళిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లె రఘునాథ్; సౌత్కు సుదర్శన్ తదితరులున్నారు. భారతీ కుమారులు, కుమార్తెలు కుమార్, శ్రీధర్, విజయలక్ష్మి, అరుణ, మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

## జాతీయ స్థాయి పోటీల్లో కౌంస్య పథకం సాధించిన శ్రీలత




రామగిరి (పెద్దపెల్లి జిల్లా) మే 27 అక్షరం న్యూస్::

ఆల్ ఇండియా పోలీస్ యోగాసన పోటీల్లో కాంస్య పతకాన్ని కమాన్ పూర్ లో పనిచేస్తున్న కూరపాటి శ్రీలత సాధించారు.హర్యానా రాష్ట్రంలోని కర్నాల్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోలీస్ క్రీడల్లో తెలంగాణ పోలీస్ ప్రతిష్ఠను చాటుతూ కమాన్‌పూర్‌కు చెందిన మహిళా పోలీస్ కానిస్టేబుల్ శ్రీలత కూరపాటి విశేష ప్రతిభ కనబరిచారు. మధుబన్‌లోని వచ్చేర్ స్టేడియంలో మే 23 నుంచి 27 వరకు జరిగిన “3వ ఆల్ ఇండియా పోలీస్ వెయిట్‌లిఫ్టింగ్ క్లస్టర్ -- యోగాసన” పోటీల్లో తెలంగాణ పోలీస్ తరపున పాల్గొన్న ఆమె కాంస్య పతకం సాధించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని సబ్ డివిజన్, కమాన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పీసీ శ్రీలత కూరపాటి తెలంగాణ నుంచి ఈ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఏకైక అథ్లెట్ కావడం విశేషం. గతంలో సైబరాబాద్ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ బహుమతులు సాధించిన ఆమె, ఈసారి జాతీయ స్థాయిలో పతకం సాధించి తెలంగాణ పోలీస్ శాఖకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు.శ్రీలత విజయంపై రామగుండం పోలీస్ కమిషనరేట్ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. విధుల్లో నిబద్ధతతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచడం ప్రశంసనీయమని కొనియాడారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతోనే ఈ విజయాన్ని సాధించగలిగారని పేర్కొన్నారు.కమాన్‌పూర్ ప్రాంతానికి చెందిన మహిళా పోలీస్ జాతీయ స్థాయిలో రాణించడం స్థానిక ప్రజల్లో ఆనందాన్ని నింపింది. యువత క్రీడల్లో ముందుకు రావడానికి శ్రీలత కూరపాటి ఆదర్శంగా నిలుస్తున్నారని పలువురు అభిప్రాయపడ్డారు. ఆమె కాస్య పతకం రావడం పట్ల కమాన్ పూర్ పోలీసులు హర్షం వ్యక్తం చేశారు.ఓ

## ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణికి ఘన సన్మానం

- సెంటినరీ కాలనీ -8 ఇంక్లైన్ పెరిక సంఘం ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం



రామగిరి, పెద్దపల్లి జిల్లా, మే 27 (అక్షరం న్యూస్):

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షురాలిగా నియమితులైన బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి ని బుధవారం కమాన్‌పూర్ మరియు సెంటినరీ కాలనీ పెరిక సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు.

ఆత్మీయ వాతావరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు, బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంధ్యారాణి కి పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఆమె నాయకత్వంలో ఓబీసీ వర్గాలకు మరింత ప్రాధాన్యం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఓబీసీ వర్గాల హక్కులు, సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మరింత చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు.సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ రాష్ట్రంలో పార్టీ అభివృద్ధికి తన వంతు పాత్ర పోషిస్తానని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో పెరిక సంఘం జిల్లా అధ్యక్షులు దుండే మల్లేష్, సెంటినరీ కాలనీ పెరిక సంఘం అధ్యక్షులు ఉగ్గే కుమార్, జనరల్ సెక్రటరీ డి. రవీందర్, ట్రెజరర్ కందుల సదానందం, సంఘ నాయకులు లగిశెట్టి చంద్రమౌళి, నరేడ్ల శ్రీనివాస్, బుద్దే ఉదయ్, కే. భూమయ్య, నరేడ్ల రమేష్, ఉగ్గే నవీన్, బుద్దే కొమురయ్య, ముద్దస్వామి, అభిలాష్, మధు కుమార్, మీస రఘురాం, ఆకుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఆర్ఎంఎస్ కార్డు లేకున్నా ఉచిత వైద్యం అందించాలి

- సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రుతో బీఎంఎస్ నేతల సమావేశం



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 27 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

సింగరేణి రిటైర్డ్ కార్మికులకు సీపీఆర్ఎంఎస్ కార్డు లేకుండానే సింగరేణి దవాఖానాల్లో ఉచిత వైద్యం అందించాలని సింగరేణి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్--బీఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సింగరేణి భవన్‌లో సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రుతో సంఘం నాయకులు సమావేశమై పెన్షనర్ల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సమావేశంలో సింగరేణి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మండ రమాకాంత్, అడ్వైజర్ పులి రాజ్ రెడ్డి, సీపీఎంఎఫ్ ట్రస్ట్ బోర్డు సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. పెన్షనర్ల సమస్యలపై డైరెక్టర్ (పా) సానుకూలంగా స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

ముఖ్యంగా సీపీఆర్ఎంఎస్ కార్డు లేని మాజీ కార్మికులకు సింగరేణి ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందించే అంశంపై అనుకూలంగా స్పందించినట్లు చెప్పారు. అలాగే పెన్షనర్ల కోసం ఆసుపత్రుల్లో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు, మూడు నెలలకు ఒకసారి మందుల పంపిణీ, మెడికల్ బిల్లుల రీయింబర్స్‌మెంట్‌ను 45 రోజుల్లో పూర్తి చేయడం, పెన్షనర్లు నివసించే ప్రాంతాలకు సమీపంలోని మెడికల్ షాపుల్లో మందులు అందుబాటులో ఉంచడం వంటి అంశాలు చర్చకు వచ్చాయని తెలిపారు.

అదేవిధంగా ప్రతి సభ్యునికి సంవత్సరానికి రూ.25 వేల వరకు వైద్య ఖర్చుల సహాయం అందించడం, సీపీఆర్ఎంఎస్ పరిమితిని రూ.8 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచడం, వైద్యం పొందిన ప్రతిసారి ఎస్ఎంఎస్ సమాచారం పంపించే విధానం అమలు చేయాలని కోరినట్లు వెల్లడించారు.ఈ అన్ని సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు.

## అడ్వాన్స్‌డ్ ఎక్సెల్ పై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 27 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

అడ్వాన్స్‌డ్ ఎక్సెల్‌పై ఎన్‌టీపీసీ రామగుండంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభంఎన్‌టీపీసీ రామగుండంలోని ఈడీసీ ఆధ్వర్యంలో వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగుల కోసం మే 27 నుంచి 29 వరకు మూడు రోజులపాటు "అడ్వాన్స్‌డ్ ఎక్సెల్" శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 40 మంది ఉద్యోగులు పాల్గొంటున్నారు.ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నానికి చెందిన కార్పొరేట్ ట్రైనర్, ఎస్‌ఆర్‌కే సాఫ్ట్‌వేర్ కన్సల్టెన్సీ అండ్ విజాగ్ స్కిల్ హబ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ శ్రీకిరణ్ బాబు వెల్నాటి నిర్వహిస్తున్నారు.ఉద్యోగులు తమ రోజువారీ విధుల్లో డేటాను మరింత సమర్థవంతంగా నిర్వహించడం, విశ్లేషించడం కోసం అవసరమైన అడ్వాన్స్‌డ్ ఎక్సెల్ నైపుణ్యాలను పెంపొందించడం ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు.శిక్షణలో భాగంగా ఎంఎస్ ఆఫీస్ 2021 నుంచి అందుబాటులోకి వచ్చిన డైనమిక్ అరే ఫంక్షన్స్, తాజా ఎక్సెల్ వెర్షన్‌లోని అడ్వాన్స్‌డ్ ఫీచర్లు, స్లైసర్లు మరియు టైమ్‌లైన్ల సహాయంతో ఇంటరాక్టివ్ డ్యాష్‌బోర్డుల రూపకల్పన, పలు డేటా సోర్స్‌ల నిర్వహణ, వాటి మధ్య సంబంధాల ఏర్పాటు, పవర్ క్వెరీ ఎడిటర్ ద్వారా సాధారణ పనులను ఆటోమేషన్ చేయడం వంటి అంశాలపై శిక్షణ అందిస్తున్నారు.సాంకేతిక ఆధారిత శిక్షణా కార్యక్రమాల ద్వారా ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధి, సామర్థ్య పెంపుదలకు ఎన్‌టీపీసీ రామగుండం నిరంతరం ప్రాధాన్యత ఇస్తోందని అధికారులు పేర్కొన్నారు.

## బక్రీద్ పండుగ నేపథ్యంలో మసీదులు,స్లాటర్ హౌస్‌ల పరిశీలన

- నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి : ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 27 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మసీదులు, స్లాటర్ హౌస్‌లను గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, సంబంధిత వెటర్నరీ వైద్యుడు డాక్టర్ ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన జాగ్రత్తలు,ప్రభుత్వ నిబంధనలను నిర్వాహకులకు వివరించారు.వెటర్నరీ డాక్టర్ ధృవీకరణ పత్రం లేకుండా పశువులను వధించరాదని స్పష్టం చేశారు.వధ ప్రక్రియ సమయంలో పరిశుభ్రత, ప్రజారోగ్యం, చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.పండుగను సామరస్య వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి కోరారు.

## గౌతమి నగర్ అయ్యప్ప స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన.. హాజరైన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 27 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

: రామగుండం కార్పొరేషన్ పరిధిలోని గౌతమి నగర్‌లో బుధవారం నిర్వహించిన అయ్యప్ప స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్ గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ... ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తి, ఆధ్యాత్మికత సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పూజారులు మురళీధర శర్మ వామన శర్మ తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గుంటూరుపల్లిలో మహిళా భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 27 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

పాలకుర్తి మండలంలోని గుంటూరుపల్లి గ్రామంలో మహిళా భవన నిర్మాణానికి బుధవారం రామగుండం ఎమ్మెల్యే ఎం ఎస్ రాజ్ ఠాకూర్ భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మహిళల అభివృద్ధి, ఆర్థిక పురోగతి, స్వయం ఉపాధి అవకాశాల పెంపు కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. మహిళా సంఘాలకు శాశ్వత వేదికగా ఈ భవనం ఉపయోగపడటంతో పాటు వారి కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు దోహదం చేస్తుందని అన్నారు.మహిళలు అన్ని రంగాల్లో ముందుండేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, గ్రామీణ ప్రాంత మహిళల ఆర్థిక--సామాజిక స్థితిగతులు మెరుగుపడేందుకు ఇలాంటి నిర్మాణాలు కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## చెక్కులు మాయం.. పేదవాడి కడుపు కొట్టేదెవరు?

- బిఆర్ఎస్ పార్టీ మండల అధికార ప్రతినిధి నెహ్రూ నాయక్



మహబూబాబాద్ జిల్లా/ కొత్తగూడ/ మే28(అక్షరం న్యూస్ )మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో పేదవాడి ప్రాణాలను కాపాడాల్సిన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, అధికార పక్షం కనుసన్నల్లో మాయమవుతున్నాయిని బిఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి నెహ్రూ నాయక్ అన్నారు ఆయన బాధితుల పక్షాన నిలబడి, ఈ దారుణాన్ని నిలదీశారు ఆసుపత్రిలో ప్రాణాలతో పోరాడి, అప్పుల ఊబిలో కూరుకుపోయిన పేదవాడికి దక్కాల్సిన చిన్న భరోసా ఆ చెక్కు. కానీ, అది ఇప్పుడు ఎవరి జేబుల్లోకి వెళ్తోంది? పాలకుల కనుసన్నల్లో ఈ చెక్కులు మాయమవుతుంటే, పేదవాడు తన కన్నీళ్లను ఎవరికి చెప్పుకోవాలి? అడుగుతున్నారు .. ఆకలితో అలమటించే వారి సాయాన్ని దోచుకోవడానికి మీకెంత ధైర్యం? అధికార మదంతో పేదవాడిని నిలువునా ముంచుతున్న ఈ అరాచకానికి అంతం లేదా?' ప్రశ్నించారు ప్రభుత్వం మారినా, పేదవాడికి అందాల్సిన సాయం ఆగిపోకూడదు. మాయం చేసిన ఆ చెక్కుల వెనుక ఉన్నది ఎవరు? లబ్ధిదారులకు ఎందుకు అన్యాయం చేస్తున్నారు? ఇప్పటికైనా అధికారులు స్పందించి మాయమైన చెక్కులను బాధితులకు అందజేయాలి. లేదంటే, పేదవాడి కన్నీళ్లకు కారకులైన మీపై బిఆర్ఎస్ పార్టీ తరపున పోరాటం ఉధృతం చేస్తాం!'?ప్రాణం తీసే అప్పుల కంటే.. ఆదుకోవాల్సిన చెక్కులు మాయం కావడం పేదవాడిని మరింతగా కుంగదీస్తోంది. వెంటనే బాధితులకు న్యాయం జరగాలి!"

## మాతా రమాబాయి 91 వర్ధంతి



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ మే 27/ అక్షరం న్యూస్ -:

మాతా రమాబాయి 91 వ వర్ధంతి బహుజన సమాజ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా రమబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల దారిలో దీపంలా వెలుగుతూ తనకు తాను కరిగిపోతూ వెలుగునిస్తూ అంబేద్కర్ లక్ష్యంలో ప్రధాన పాత్ర పోషించిన తన కన్న బిడ్డలను కోల్పోయిన మాతృమూర్తి మాతా రమాబాయి అని అన్నారు. మీరు చూపించిన ఉన్నతమైన బాటలో నడుస్తూ మీ ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ చెన్నూరు నియోజకవర్గం అధ్యక్షులు గాజుల శంకర్, ఉపాధ్యక్షులు ఎం.డి మతిన్ ఖాన్, బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ గోమాస బ్రహ్మానందం, ఆయిల్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## వీధి దీపాల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకున్న ఆంజనేయులు సాగర్



శేరిలింగంపల్లి అక్షరం ప్రతినిధి మే 28: అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ సిద్ధిక్ నగర్ కాలనీలలో దాదాపు అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలను స్వయంగా దగ్గరుండి ఏర్పాటు చేయించి కాలనీలను వెలుగులతో నింపుతున అంజయ్య నగర్ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్. ఈ వీధి దీపాల ఏర్పాటు వల్ల రాత్రి సమయంలో ప్రజలు, ముఖ్యంగా మహిళలు, ఎలాంటి భయాందోళనలు లేకుండా సురక్షితంగా సంచరించే అవకాశం కలుగుతోందన్నారు. చీకటి కారణంగా చోటుచేసుకునే అసౌకర్యాలు, ప్రమాదాలు అవాంఛనీయ ఘటనలను నివారించడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. అంజయ్య నగర్ డివిజన్‌లో కొన్ని ప్రాంతాల్లో వెలుగుల కొరత కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించి, ముందస్తు జాగ్రత్త చర్యగా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వీధి దీపాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. కాలనీల్లో భద్రతా వాతావరణం ఏర్పడటంతో పాటు ప్రజలకు సౌకర్యవంతమైన పరిస్థితులు కల్పించడమే తమ లక్ష్యమని ఆంజనేయులు సాగర్ తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లలో జాప్యానికి తావులేకుండా చూడాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) మే 27: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లతో పాటు మిల్లులకు తరలింపు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అధికారులు, నిర్వాహకులను ఆదేశించార . మండలంలోని వెల్ది, జాఫరగూడెం గ్రామాల పరిధిలో గల ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ బుధవారం సందర్శించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్ల నిర్వహణ తీరు, ధాన్యం రవాణా నమోదు ప్రక్రియ, కాంటా వివరాలు…ఇప్పటి వరకు ఎన్ని లారీలు కొనుగోలు కేంద్రానికి చేరుకున్నాయి.. లోడ్ తో ఎన్ని లారీలు మిల్లులకు వేళ్లాయి… అన్-లోడింగ్ ఎన్ని అయ్యాయి..ప్రస్తుతం మిల్లులలో అన్-లోడింగ్ కాని లారీలు ఎన్ని ఉన్నాయనే విషయాలపై ఆరా తీశారు. కల్లాల్లో ఇంకా ఎంత ధాన్యం ఉంది.. కాంటా వేయాల్సిన ధాన్యం ఇంకేంత ఉం ది….తదితర విషయాలను తెలుసుకొని, రిజిస్టర్లు, ట్రక్ షీట్లను తనిఖీ చేశారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం నిల వలు ఎక్కువ కాలం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉండకుండా లోడింగ్…అన్ లోడింగ్ ను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని. రైతుల వద్ద నుంచి ఎట్టి పరిస్థితుల్లోను అదనపు చార్జీలు వసూలు చేయకూడదని, చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన సమస్యలు, ఫిర్యాదుల కోసం సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1800-425-6605 కు సంప్రదిం చాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేష్ రెడ్డి, సర్పంచ్ సింగిరెడ్డి సునీత, ఐకేపీ ఏపిఎం వినీల, సీసీలు ఎల్లస్వామి, రీనావతి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు

## ముల్కనూర్ లో రెడ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/మే 27/అక్షరం న్యూస్-:

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో భారీ రెడ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్-2026ను ఈ నెల 28వ తేదీ గురువారం నుంచి ముల్కనూర్ హై స్కూల్ మైదానంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల జట్లు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. గ్రామాల వారీగా ఆధార్ కార్డు ఆధారంగా జట్లను అనుమతిస్తామని వెల్లడించారు. ప్రతి మ్యాచ్‌ను 8 ఓవర్లుగా నిర్వహించనుండగా అందులో 2 ఓవర్లు పవర్‌ప్లే విధానంలో ఉండనున్నాయి.టోర్నమెంట్ విజేత జట్టుకు రూ.20 వేల నగదు బహుమతి, రన్నరప్ జట్టుకు రూ.10 వేల నగదు బహుమతి అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రవేశ రుసుమును రూ.1,000గా నిర్ణయించారు.క్రికెట్‌ను ప్రేమించే యువత పెద్ద ఎత్తున పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. జట్ల నమోదు ఇతర వివరాల కోసం బాలు (7702794979) రాజేందర్ (7036111529)లను సంప్రదించవచ్చని తెలిపారు.ప్లే ఫెయిర్, ప్లే హార్డ్ ఎంజాయ్ ది గేమ్ నినాదంతో టోర్నమెంట్ ఉత్సాహభరితంగా సాగనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

### పాలకుర్తిలో మహిళా సంఘ భవనానికి

# భూమిపూజ -- రైతులకు రాయితీ విత్తనాల పంపిణీ





జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 27 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

పాలకుర్తి మండలంలోని పాలకుర్తి గ్రామంలో బుధవారం నిర్వహించిన మహిళా సంఘ భవన నిర్మాణ భూమిపూజ కార్యక్రమం, రైతులకు రాయితీపై పచ్చిరొట్టె విత్తనాల పంపిణీ కార్యక్రమాల్లో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళా సంఘాల సమావేశాలు, అభివృద్ధి కార్యక్రమాలకు మహిళా సంఘ భవనం ఉపయోగపడుతుందని తెలిపారు.అలాగే రైతుల ఆదాయం పెంపు, భూమి సారవంతం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. “పొగలేని పొలం -- రోగంలేని గ్రామం” నినాదంతో పంట అవశేషాలు, గడ్డి, కొయ్యలను కాల్చవద్దని రైతులకు సూచించారు. గడ్డి తగలబెట్టడం వల్ల గాలి కాలుష్యం పెరగడంతో పాటు నేల సారం తగ్గే ప్రమాదం ఉంటుందని వివరించారు.ప్రతి ఏడాది రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్టె, జీలుగ, జనుము విత్తనాలను ప్రభుత్వం అందజేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కొండు రాజేశ్వర్ రావు నేత్రదానం మానవత్వానికి నిదర్శనం

- **రత్నాపూర్‌లో ఆదర్శంగా నిలిచిన కుటుంబ సభ్యులు**

రామగిరి (పెద్దపల్లి జిల్లా) మే 27 అక్షరం న్యూస్::

రత్నాపూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎఫ్‌సీఐ ఉద్యోగి కొండు రాజేశ్వర్ రావు(80) మరణానంతరం ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానం చేయడం మానవత్వానికి నిదర్శనమని సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు, కరీంనగర్ కార్పొరేటర్ తాటి ప్రభావతి, సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి అన్నారు. కొండు రాజేశ్వర్ రావు వడదెబ్బతో మృతి చెందగా నేత్రదానం ద్వారా ఇద్దరు జీవితాల్లో వెలుగులు నింపాలని భావించి నేత్రదానం చేయడానికి ముందుకు రావడంతో లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ, సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్.లింగమూర్తి సహకారంతో ఎల్.వి.ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నేత్రాలని స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు, కరీంనగర్ కార్పొరేటర్ తాటి ప్రభావతి, సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధానకార్యదర్శి లింగమూర్తి మాట్లాడుతూ వడదెబ్బతో మృతి చెందిన రాజేశ్వర్ రావు కళ్లను దానం చేయడం ద్వారా ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం కల్పించారని అభినందించారు. సమాజానికి ఆదర్శంగా నిలిచే విధంగా కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం గొప్పదని అన్నారు. నేత్రదానం వంటి సేవా కార్యక్రమాలపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. మరణానంతరం కూడా మరొకరికి వెలుగునిచ్చే గొప్ప దానం నేత్రదానమని పేర్కొన్నారు. రాజేశ్వర్ రావు కుటుంబ సభ్యుల సేవాభావం సమాజానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బీరుకూరి దత్తు ప్రసాద్ రావు, సదాశయ సభ్యులు రాజ మహేందర్ రెడ్డి, కుటుంబ సభ్యులు కొండు రవీందర్ రావు, పల్లె అమర, తాటి ప్రభావతి, ఉమ, జయశ్రీ-శ్రీనివాసరావు, రాధ-రాజేందర్, మాజీ జెడ్పీటీసి గంట వెంకటరమణ రెడ్డి, డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట చంద్రయ్య, ఉపసర్పంచ్ బాద్రపు ప్రవళిక-ప్రశాంత్, బీజేపీ మండల అధ్యక్షుడు కొండు లక్ష్మణ్, కొండు అంజన్న, మాజీ ఎంపీటీసీ ధర్మల రాజసంపత్, వార్డు సభ్యులు కెక్కర్ల ఉష-అశోక్, పబ్బ



ప్రవంతి-వెంకటేష్, కలవేన రవి, జక్కుల పద్మ-చందన్, బత్తుల రాజమణి-రమేష్, అల్లి రమేష్, బత్తిని ప్రశాంత్, పున్నం మనీ తేజ, జక్కుల దామోదర్ రావు, కొవ్వూరి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ప్రగాఢ సానుభూతి:-

రత్నాపూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎఫ్‌సీఐ ఉద్యోగి కొండు రాజేశ్వర్ రావు మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ ధైర్యంగా ఉండాలని సూచించారు. రాజేశ్వర్ రావు సేవాభావం, నేత్రదానం సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

## డాక్టర్ చీమ శ్రీనివాస్‌కు కేకే కమిటీలో అవకాశం కల్పించాలని ఆదివరాహ స్వామిని వేడుకున్న తెలంగాణ ఉద్యమకారులు



రామగిరి, పెద్దపల్లి జిల్లా, మే 28 (అక్షరం న్యూస్):

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ కి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేకే కమిటీలో సభ్యుడిగా అవకాశం కల్పించాలని కోరుతూ రామగిరి, కమాన్పూర్ మండలాల తెలంగాణ ఉద్యమకారులు బుధవారం కమాన్పూర్ ఆదివరాహ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు మాట్లాడుతూ, గత తొమ్మిది సంవత్సరాల క్రితం ఉద్యమకారుల ఫోరంను రిజిస్ట్రేషన్ చేయించి ఉద్యమకారుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన డాక్టర్ చీమ శ్రీనివాస్ , పదేళ్లుగా నిశ్చేష్టంగా ఉన్న ఉద్యమకారులను మళ్లీ చైతన్యపరిచారని కొనియాడారు. అలాంటి నాయకుడికి రాష్ట్ర ప్రభుత్వం కేకే కమిటీలో అవకాశం కల్పించాలని భగవంతుని మనస్ఫూర్తిగా ప్రార్థించారు.అలాగే మే 31న హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల ముఖ్య కార్యకర్తలు ఉదయం 12 గంటలలోపు ప్రెస్ క్లబ్‌కు చేరుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పోతు జ్యోతి రెడ్డి, తెలంగాణ తొలి మలి చివరి దశ ఉద్యమకారులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నూనె రాజేశం ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి బత్తుల శంకర్, కమాన్పూర్ మండల అధ్యక్షులు దాసరి రామస్వామి, ఉపాధ్యక్షులు అనేవేన భూమయ్య, కార్యదర్శి దండేపల్లి రాజయ్య, కోశాధికారి అవునూరి నర్సయ్య, ఉద్యమకారుడు గుంద్రాతి మల్లయ్య తదితరులు పాల్గొని ఘనంగా ఆదివరాహ స్వామిని పూజించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

## గ్రామదీపికల సమస్యలను పరిష్కరించాలి ..

- దాసరి నాగమణి
- కొత్తపల్లి ధనలక్ష్మి



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 27 వైరా (అక్షరం న్యూస్)

వేలాదిమంది కార్మికులు కనీస వేతనం అందక అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారు. గ్రామ దీపికలకు కనీస వేతనం రూ.26 వేలు పెంచి ప్రభుత్వం వెంటనే వివోల కార్మికులను ఆదుకోవాలని కొణిజర్ల లో గత పది రోజులుగా గ్రామ దీపికల రిలే నిరహార దీక్షలు చేస్తున్న ప్రభుత్వం వారి సమస్య లు పరిష్కరించడంలో చిత్తవుద్ది చూపించడం లేదు. తీవ్రమైన ఎండల్లో 46 డిగ్రీలు చూపిస్తున్న వారు టెంట్ల వద్ద నుండి లేవకుండా సమస్యల పరిష్కారం కోసం దాసరి నాగమణి, కొత్తపల్లి ధనలక్ష్మి

పోరాడుతూనే ఉన్నారని అన్నా రు. ఎన్నికల హామీల్లో ప్రభుత్వం సంఘటిత అసంఘిత విఈవో గ్రామపంచాయతీ వర్కర్లను రెగ్యులర్ చేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇప్పుడు కన్నెత్తి వారి వైపు చూడకుండా ఉండటం సరైంది కాదని అన్నారు. గ్రామదీపికలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిం చాలని కోరారు. గ్రామ దీపికల అధ్యక్షురాలు మాణిక్యం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి ధనలక్ష్మి కొనిజర్ల మండలం సభ్యులు కొత్తపల్లి పద్మ దాసరి నాగమణి సునీత అరుణ గ్రామ దీపికల పాల్గొన్నారు .

## ఖమ్మం నియోజకవర్గ ముస్లిం సోదరులతో పాటు. ఉమ్మడి ఖమ్మం జిల్లాముస్లిం సోదర సోదరీమణులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర మంత్రి తుమ్మల



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 27 ( అక్షరం న్యూస్)

ఖమ్మం నియోజకవర్గం నియోజకవర్గం పరిధిలో ముస్లిం సోదరులతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదర సోదరీమణులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.. త్యాగానికి, సహనానికి, భక్తి విశ్వాసాలకు.. ఈ పండుగ ప్రత్యేకంగా నిలుస్తుందని.. మనుషుల మధ్య . సామరస్యం, ఐకమత్యం, సోదర భావం. స్ఫూర్తితో.. బక్రీద్ పండగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని మంత్రి తుమ్మల . తన ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు .

## హైడ్రాలిక్, ఎలక్ట్రో - మెకానికల్ వెహికల్‌లిఫ్టర్‌ను ప్రారంభించిన పోలీస్ కమిషనర్..



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 27 (అక్షరం న్యూస్)

పోలీసు వాహనాల నిర్వహణను మెరుగుపరచడానికి, మరమ్మతులను వేగవంతం చేయడానికి యంటి సెక్షన్ వర్క్ షాప్‌లో ఏర్పాటు చేసిన హైడ్రాలిక్, ఎలక్ట్రో - మెకానికల్ వెహికల్ లిఫ్టర్‌ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రారంభించారు. పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు నిరంతరం రోడ్లపై తిరగడం వల్ల వచ్చే వాహన మరమ్మతుల కోసం మెకానిక్ వర్క్ షాప్ లలో గంటల తరబడి కాకుండా నిమిషాల్లో సిద్ధమయ్యే విధంగా వెహికల్ లిఫ్టర్లు కీలక పాత్ర పోషిస్తాయని పోలీస్ కమిషనర్ తెలిపారు. దీనివల్ల పోలీస్ శాఖ వాహనాల జీవితకాలం పెరగడమే కాకుండా, నిర్వహణ ఖర్చులు తగ్గుతాయన్నారు.కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (ఏఆర్) కుమారస్వామి, ఏఆర్ ఏసీపీ లు సుశీల్ సింగ్, నర్సయ్య, ఆర్ ఐ లు కామరాజు, శ్రీశైలం, సురేష్, నాగుల్ మీరా పాల్గొన్నారు.

## పంట అవశేషాలను కాల్చొద్దు..

- భూమి ఆరోగ్యమే రైతు కుటుంబానికి భరోసా..
- నకిలీ విత్తనాల మోసాలపై అప్రమత్తంగా ఉండాలి..
- వ్యవసాయ విస్తరణ అధికారి శిరిణ్మయి బాల బత్తుల..



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 27 (అక్షరం న్యూస్)

రైతు చెమటతో పుడుతున్న అన్నం సమాజానికి జీవనాధారం. అలాంటి రైతు భవిష్యత్తు సురక్షితంగా ఉండాలంటే భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంతో అవసరమని రఘునాథపాలెం మండల వ్యవసాయ విస్తరణ అధికారి శిరిణ్మయి బాలబత్తుల రైతులకు అవగాహన కల్పించారు. రఘునాథపాలెం మండలంలోని మల్లెపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శిరిణ్మయి బాలబత్తుల రైతులతో మమేకమై పంట అవశేషాల కాల్చివేత వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పంట అవశేషాలను కాల్చడం వల్ల భూమిలోని సేంద్రియ పదార్థాలు, పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు నశించి నేల సారవంతత తగ్గిపోతుందని తెలిపారు. గడ్డి, కంకి, చెత్త కాల్చివేత వల్ల వాయు కాలుష్యం పెరిగి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని, ప్రజల ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. నేలలో తేమ శాతం తగ్గిపోవడం వల్ల భవిష్యత్తులో దిగుబడులు పడిపోవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు."రైతు భూమి... అతని ఆస్తి మాత్రమే కాదు... తరాల భవిష్యత్తు" అని పేర్కొంటూ పంట అవశేషాలను కాల్చకుండా నేలలో కలియదున్ని సేంద్రియ ఎరువులుగా మార్చుకోవాలని సూచించారు. జీవామృతం, ఘన జీవామృతం, వర్మీ కంపోస్ట్ వంటి సహజ వ్యవసాయ విధానాలను అనుసరిస్తే భూమి ఆరోగ్యం మెరుగుపడి పంటల దిగుబడులు పెరుగుతాయని చెప్పారు.అలాగే ప్రస్తుతం మార్కెట్లో నకిలీ విత్తనాల విక్రయాలు పెరుగుతున్న నేపథ్యంలో రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతి పొందిన దుకాణాల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా బిల్ తీసుకోవాలని సూచించారు. విత్తన సంచిపై లేబుల్, గడువు తేదీ, మొలక శాతం, కంపెనీ వివరాలు పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని తెలిపారు.నకిలీ విత్తనాల వాడకం వల్ల మొలకలు సరిగా రాక రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొనే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రైతులు నేల పరీక్షలు నిర్వహించి భూసారానికి అనుగుణంగా పంటలు, విత్తనాలు ఎంపిక చేసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమం రైతుల్లో చైతన్యం నింపడమే కాకుండా... "భూమిని కాపాడితేనే భవిష్యత్తు పంటలు పండుతాయి" అనే సందేశాన్ని హృదయాలను హత్తుకునేలా రైతులకు స్పష్టతనిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు ఆదర్శం...

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- దేశంలోనే తొలిసారిగా మహిళా
- సంఘాల ద్వారా సోలార్ ప్లాంట్ ఏర్పాటు..
- మహిళలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు..
- బోనకల్ మండలంలోని అన్ని గ్రామాలకు పైలట్ ప్రాజెక్టు క్రింద సోలార్ విద్యుత్ సరఫరా..
- పంట అవశేషాలను కాల్చితే చట్టప్రకారం చర్యలు..
- ఎర్రుపాలెం మండలంలో సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభించి, పెట్రోల్ బంకు కు భూమి పూజ చేసిన డిప్యూటీ సీఎం..



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 27 (అక్షరం న్యూస్)

మహిళల ఆర్థిక స్వావలంబన కోసం మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.బుధవారం ఎర్రుపాలెం మండలం వెంకటాపురం గ్రామంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ సీఎస్ దాన కిషోర్, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, సెర్ఫ్ సీఈఓ దివ్యా దేవరాజన్, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి పర్యటించిన డిప్యూటీ సీఎం వెంకటాపురంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో 2 కోట్ల 84 లక్షలతో ఏర్పాటు చేసిన 1 మెగా వాట్ సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ప్రారంభించి, కోటి 30 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ.. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. గతంలో వైఎస్సార్ హయాంలో ప్రవేశపెట్టిన పావలా వడ్డీ, వడ్డీ లేని రుణాల పథకాలను తిరిగి ప్రజా ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మహిళా సంఘాలకు రూ.5 లక్షల వరకు ఉన్న వడ్డీ లేని రుణాల పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు. పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, ఇందిరమ్మ క్యాంటీన్లు, ఆర్టీసీకి అద్దె బస్సులు, టర్మరిక్ యూనిట్లు వంటి పెద్ద వ్యాపారాల్లో మహిళా సంఘా లను భాగస్వామ్యం చేస్తున్నామని పేర్కొన్నారు.ఐదేళ్లలో మహిళా సంఘాలకు లక్ష కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తామని ప్రకటించగా, తొలి రెండున్నరేళ్లలోనే రూ.66 వేల కోట్ల రుణాలు పంపిణీ చేశామని తెలిపారు.మహిళా సంఘాలకు తక్కువ ధరకు భూములు కేటాయించి, సాంకేతిక సహకారం అందిస్తూ సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేపడుతున్నామని, ఉత్పత్తి అయ్యే విద్యుత్తును ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగినా ఎలాంటి కోతలు లేకుండా నాణ్యమైన నిరంతరాయ విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. గతంలో 15 వేల మెగావాట్లుగా ఉన్న పీక్ డిమాండ్ ప్రస్తుతం 18,480 మెగావాట్లకు చేరిందన్నారు.బోనకల్ మండలంలోని అన్ని గ్రామాలకు పైలట్ ప్రాజెక్టు క్రింద సోలార్ విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా రైతులు పంట అవశేషాలను కాల్చవద్దని సూచించారు. పంట అవశేషాల దహనం వల్ల అగ్ని ప్రమాదాలు, కాలుష్యం పెరుగుతాయని, భవిష్యత్తులో ఎవరైనా కాల్చితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.




గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ.. చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కావడం స్ఫూర్తిదాయకమన్నారు. మహిళల అభివృద్ధే తెలంగాణ ప్రగతికి పునాది అని పేర్కొన్నారు. మహిళలకు నాణ్యమైన ఇందిరమ్మ చీరల పంపిణీకి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోందన్నారు. పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ సీఎస్ దాన కిషోర్ మాట్లాడుతూ.. ప్రపంచం మొత్తం గ్రీన్ ఎనర్జీ వైపు అడుగులు వేస్తోందని, సోలార్ విద్యుత్ పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుందని అన్నారు. మహిళా సంఘాలను ధాన్యం కొనుగోలు, రైస్ మిల్లులు, లాజిస్టిక్ పార్కుల నిర్వహణలో భాగస్వామ్యం చేసే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు.సెర్ఫ్ సీఈఓ దివ్యా దేవరాజన్ మాట్లాడుతూ.. మహిళా సంఘాలు భారీ సోలార్ ప్రాజెక్టులను నిర్వహించడం సంతోషకరమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.రెడ్‌కో సిఎండి అనిల మాట్లాడుతూ.. వెంకటాపురం గ్రామంలో రెండు మహిళా సంఘాలు కలిసి ఏర్పాటు చేసిన ఈ 1మెగా వాట్ సోలార్ ప్లాంట్ ద్వారా నెలకు సుమారు రూ.4.5 లక్షల ఆదాయం మహిళా సంఘాలకు లభిస్తుందని పేర్కొన్నారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ.. మహిళా సంఘాల ద్వారా రూ.3 కోట్ల విలువైన ఈ భారీ ప్రాజెక్టు విజయవంతంగా ఏర్పాటు చేశామని తెలిపారు. సోలార్ ప్లాంట్ నిర్వహణపై మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని, ఈ ప్రాజెక్టు ద్వారా వచ్చే ఆదాయాన్ని మరిన్ని ఉపాధి అవకాశాల సృష్టికి వినియోగించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు.అనంతరం టర్మరిక్ బాయిలర్ యూనిట్‌లను, ఎర్రుపాలెం మండలంలోని అంగన్వాడీ కేంద్రాల నిర్వాహకులకు ఇండక్షన్ స్టవ్‌లు పంపిణీ చేసి, చైతన్య మండల సమాఖ్య సభ్యులకు 10 కోట్ల 45 చెక్కును డిప్యూటీ సీఎం అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం నగరాన్ని విద్యా ఉపాధి కేంద్రంగా తీర్చిదిద్దుతాను

- ఎమ్మెల్యే మక్కాన్సింగ్

జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 27 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

నగరాన్ని నివాసయోగ్యమైన నగరంగా , విద్యా, ఉపాధి కేంద్రంగా ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దుతున్నామని రామగుండం శాసన సభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. డి ఎం ఎఫ్ టి నిధులు రూ. 4.18 కోట్లతో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 26, 02వ డివిజన్లలో సి సి, బి టి రోడ్ల నిర్మాణం, 48వ డివిజన్‌లో వర్షపు నీటి కాలువ నిర్మాణం, అలాగే 49వ డివిజన్‌తో పాటు ఇతర డివిజన్లలో ప్రహరీ గోడల నిర్మాణ పనులకు శాసన సభ్యులు శ్రీ ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ బుధవారం టీచర్స్ కాలనీ లో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ మహంకాళి స్వామి తో కలిసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ 800 కోట్లతో మునిసిపల్ కార్పొరేషన్ లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మరో రూ 400 కోట్ల నిధుల మంజూరుకు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. . త్వరలో కొత్తగా ఎనిమిది కొత్త ట్యాంకులు నిర్మించి నగరమంతా 24ఇ7 నీటి సరఫరా ఆరంభించనున్నామని అన్నారు. ప్రతి చిన్న వీధిలోనూ సకల సదుపాయాలు కల్పించాలని



ఇందుకు అవసరమైన నిధులు తీసుకువస్తున్నామని అన్నారు. నిధులు కొరతతో అర్ధాంతరంగా ఆగిపోయిన కోర్టు భవనాన్ని నిధులు మంజూరు చేయించి పూర్తి చేయిస్తామని అన్నారు.ప్రభుత్వ పాటశాలలు అద్భుత భవనాలతో నాణ్యమైన విద్య అందిస్తున్నందున అందులోనే పిల్లల్ని చేర్పించాలని అన్నారు.కబ్జా కు గురయిన ప్రభుత్వ భూమి అంగుళం కూడా తగ్గకుండా తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. త్వరలో ఇక్కడ అందుబాటులో ఉన్న భూమి లో హరిత హోటల్ నిర్మిస్తామని అన్నారు.మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ ఎం ఎల్ ఏ ఆదేశాల మేరకు టీచర్స్ కాలనీ లో వర్షాకాలంలో వరద ప్రభావం లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. టీచర్స్ కాలనీ లో కాలువ ను కుదించి నిర్మించిన ఆక్రమణ లు వెంటనే తొలగించడానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. గతంలో ద్విచక్ర వాహనం వెళ్లడానికి కూడా అవకాశం లేని టీచర్స్ కాలనీ, కె సి ఆర్ కాలనీ , ఆర్ టి సి కాలనీ లలో ని వీధుల్లో రోడ్లన్నీ నాణ్యత తో చేపట్టడం జరిగిందని అన్నారు.చివరి ఇంటి వరకు కూడా రోడ్లు, యు జి డి, మంచి నీళ్ళు, వీధి దీపాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు),రామగుండం నగర పాలక సంస్థ కమీషనర్ జె.అరుణ శ్రీ,



కార్పొరేటర్లు రేణికుంట్ల నిర్మల, సాగి సంతోష్ రావు, వెంగళ బాపు, బాలసాని తిరుపతి, దాసరి సాంబమూర్తి, బదావత్ నర్సమ్మ,,భాగ్యలక్ష్మి,సత్య ప్రసాద్, నగర పాలక సంస్థ ఎస్ ఇ గురువీర తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం రైతులారా అధైర్య పడకండి

**• తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



యాదాద్రి భువనగిరి జిల్లా /యాదగిరిగుట్ట /అక్షరం న్యూస్ : మే 27 :తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తామని..రైతులు ఎవరు అధైర్యపడొద్దని "తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య " ఆర్డీఓ కృష్ణరెడ్డితో ఫోన్ కాల్ లో మాట్లాడి రైతులకు భరోసానిచ్చారు. బీర్ల అయిలయ్య రైతన్నకు అండగా ఉండి తడిసిన ధాన్యం కొనుగోలుకు ఆయన హామీ ఇచ్చారు. రెండు రోజుల పాటు వివాహ వార్షికోత్సవం పర్యటన ముగించుకొని రాగానే ' వెంటనే రైతుల సమస్యలపై స్పందించిన విప్ బీర్ల అయిలయ్య. ఆర్డీవోకు ఆదేశాలు ఇచ్చారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు భరోసా కల్పించాలని.ఏ రైతులు ఆందోళన చెందవద్దన్నారు... ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్నారు. వివాహ వార్షికోత్సవ పర్యటన నుంచి వచ్చి రైతు సమస్యలపై దృష్టి పెట్టిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య .తడిసిన ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టి రైతన్న కష్టాన్ని అర్థం చేసుకున్న ప్రజానేత మన బీర్ల అయిలయ్య.

## కొత్త నీటి మోటార్లను ఏర్పాటు చేసి నీట సమస్యను తీర్చిన

**•మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి బీజని బాలమణి- భాస్కర్**



యాదాద్రి భువనగిరి జిల్లా /యాదగిరిగుట్ట /అక్షరం న్యూస్ : మే 27 : ఆలేరు పట్టణంలోని స్థానిక బీసీ కాలనీ మరియు సుభాష్ నగర్ కాలనీలో మహాలక్ష్మి రైస్ మిల్ దగ్గర స్థానిక కాలనీవాసులు నీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడగా ఈ సమస్యను తీర్చాలనిబి మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి బీజని బాలమణి- భాస్కర్ దృష్టి తీసుకెళ్లగా బుధవారం రోజు కాలనీలో నీటి సరఫరా విషయంలో ఇబ్బందులు తొలగించడానికి అధికారులకు మరియు మున్సిపల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి కొత్త నీటి మోటార్లను ఏర్పాటు చేసి నీటి సమస్యను తీర్చడానికి కృషి చేశారు. చాలా సంవత్సరాలుగా ముఖ్యంగా వేసవి కాలంలో నీటి ఎద్దడి సమస్యను ఎదుర్కొంటు ఇబ్బంది పడుతున్న కాలనీ ప్రజలు ఈరోజు నీటి సమస్య తీర్చడంతో మున్సిపల్ చైర్ పర్సన్ కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు శ్రీ తాళ్లపల్లి మహేష్, గంధమాల శోభన్ బాబు, ఏం ప్రవీణ్ కుమార్, చింతల గణేష్, దశరథ,కంసాని బిక్షపతి,తదితరులు పాల్గొన్నారు...

## రాజాపేటలో చాచా నెహ్రూకు ఘన నివాళి



యాదాద్రి భువనగిరి జిల్లా /యాదగిరిగుట్ట / అక్షరం న్యూస్ : మే 27 - : బుధవారం రోజు రాజాపేట మండల కేంద్రంలో భారత దేశ తొలి ప్రధానమంత్రి, భారతరత్న, ఆధునిక భారత నిర్మాత స్వర్గీయ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ (చాచా నెహ్రూ) వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి నెహ్రూ చేసిన సేవలను, ప్రజాస్వామ్య పరిరక్షణకు, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని నాయకులు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు ,స్థానిక ఉపసర్పంచ్, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఉపసర్పంచ్‌లు, గ్రామ శాఖ అధ్యక్షులు, యూత్, ఎన్.ఎస్.యు.ఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అనాథ కుటుంబానికి అండగా నిలిచిన యువజన సంఘం



రాజన్న సిరిసిల్ల / ఇల్లంతకుంట / మే 27/అక్షరం న్యూస్ : ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన కీర్తి భారతి(65) అనారోగ్యంతో మృతి చెందగా, మృతదేహాన్ని ఉంచేందుకు సొంత ఇల్లు లేక కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక యువజన సంఘ సభ్యులు మానవత్వం చాటుతూ తమ సంఘ భవనాన్ని ఆశ్రయంగా ఇచ్చారు. మృతదేహం పాడవకుండా ఉండేందుకు ఫ్రీజర్ ఏర్పాటు చేసి రాత్రంతా భద్రపరిచారు. అనంతరం బంధువులు, స్థానికులు కడసారి చూపు చూసుకునేలా ఏర్పాట్లు చేసి అంత్యక్రియలు నిర్వహించేందుకు సహకరించారు. మృతురాలి కుటుంబానికి స్థానిక సర్పంచ్ మామిడి రాజు రూ.10 వేలరూపాయలు , ఉపసర్పంచ్ మూగు నాగరాజు శర్మ రూ.5,116 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. యువజన సంఘ అధ్యక్షులు కార్తీక్,వార్డు సభ్యులు చేరాల వంశీకృష్ణ, అంతటి శ్రీకాంత్, యువజన సంఘాల సభ్యుల సేవలను గ్రామ ప్రజలు అభినందించారు.

# ప్రజా దర్బార్ లో వచ్చిన ప్రతి దరఖాస్తుకు ప్రాధాన్యత ఇస్తూ వెంటనే పరిష్కరించాలి

**•100 రోజుల పనులు, గ్రామీణ అంతర్గత అభివృద్ధి, సీసీ రోడ్లు,చెక్ డ్యాములు రోడ్ల పనుల్లో వేగం పెంచాలి,**

**•దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళల స్వయం ఆర్థిక అభివృద్ధి కోసం వడ్డీ లేని రుణాలను పంపిణీ చేయడం జరుగుతుందిలి**

**•అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్, ఇందిరమ్మ ఇండ్లు, అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం,**

**•రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా,స్త్రీ శిశు సంక్షేమ,శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కలి**



మహబూబాబాద్ జిల్లా/ కొత్తగూడ/ మే28(అక్షరం న్యూస్ ) కొత్తగూడ మండలం లోని బుధవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, ఎస్పీ డాక్టర్ శబరిష్, డీఎఫ్ఓ విశాల్ బత్తుల, ఆర్డిఓ క్రిష్ణవేణి, జడ్పీ సీఈవో పురుషోత్తం, జిల్లాస్థాయి ఉన్నతాధికారులందరితో కలిసి మహబూబాబాద్ జిల్లా ములుగు నియోజకవర్గ పరిధి కొత్తగూడ ఏజెన్సీ ఓటాయి, కొత్తగూడ మండల కేంద్రం లో రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క, లిప్రజా దర్బార్‌లి కార్యక్రమాన్ని నిర్వహించారు,ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ లిప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని ప్రజా దర్బార్‌లోలి వచ్చిన

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, అధికారులకు మంత్రి సూచించారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామపంచాయతీ సర్పంచులు, సూచించిన సమస్యల పరిష్కారం నిమిత్తం వెంటనే కార్యక్రమంలో పాల్గొన్న అధికారులకు ఆదేశాలు తగ్గ సూచనలు జారీ చేశారు, ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత విభాగానికి పంపి అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి వారు చేసుకున్న సంక్షేమ ఫలాల పథకాల ద్వారా లబ్ధి చేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు,దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం సుమారు 60 వేల 400 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను అందించడం జరుగుతుందని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ లబ్ధిదారులు మహిళా సంఘాలలో సభ్యులుగా ఉంటే ఆర్థిక భరోసా కింద లక్ష రూపాయలు అందించడం జరుగుతుందన్నారు, గతంలో ఐదు లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరిగిందని, ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో 10 లక్షల రూపాయల వరకు వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామని అన్నారు, గ్రామీణ ప్రాంతాలలో 100 రోజుల పనులలో అధికంగా కూలీలు పాల్గొని వేగంగా ఆ పనుల్లో నిమగ్నం కావాలని తద్వారా మీ యొక్క ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని అన్నారు, రాష్ట్రవ్యాప్తంగా మహిళల ఆత్మ గౌరవం నిమిత్తం మహిళా సమైక్య భవనాలను నిర్మించడం జరుగుతుందని, అందులో భాగంగానే మండల పరిధిలో ఇప్పటికే 40 భవనాల నిర్మాణ శంకుస్థాపనలు చేయడం జరిగిందని, ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా పాలపిట్ట రంగులో చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేయడం జరిగిందని ఇప్పుడు చిలకపచ్చ రంగులు అద్భుతంగా చీరలను అందించడం జరుగుతుందన్నారు,రైతుల పొలాల వద్దకు వెళ్లడం కోసం రహదారుల నిర్మాణం లో ఫారెస్ట్ అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్లు నిర్మించాలని తెలిపారు,పేదవాడి సొంత ఇంటి నిర్మాణ కలను సహకారం చేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అందులో భాగంగానే జిల్లాకు వచ్చిన కోటాకు అదనంగా మరో రెండు వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు, జిల్లాలోని ఇండ్లు నిర్మించుకోలేని పరిస్థితిలో ఉన్న వారి సౌకర్యార్థం ఒక సంస్థ ద్వారా ఇండ్లు నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు,గ్రామీణ ప్రాంతాలలో కరెంటు సమస్యలను తీర్చడం కోసం ఉపముఖ్యమంత్రి గారి చేత ప్రత్యేకంగా కరెంటు స్తంభాల మంజూరు నిధుల మంజూరు చేయించడం జరిగిందని ప్రతి ఒక్కరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా నాణ్యమైన కరెంటును అందించాలని మంత్రి కోరారు,ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్వయంగా ప్రజల సమస్యలను ఓపికగా వింటూ దరఖాస్తులను స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యల తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. ప్రజా దర్బార్‌లో ప్రధానంగా ఇండ్ల స్థలాలు, ఆసరా పెన్షన్లు, భూమి సమస్యలు, రేషన్ కార్డులు, గ్రామాల్లో రోడ్లు, తాగునీరు మరియు ఆరోగ్య సహాయం వంటి పలు అంశాలపై ప్రజలు మంత్రికి వినతి పత్రాలు అందజేశారు.ప్రజల నుండి వచ్చిన కొన్ని దరఖాస్తులను మంత్రి సీతక్క గారు అక్కడికక్కడే పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు బదిలీ చేశారు. ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, చట్టపరిధిలో ప్రతి అర్జీని వీలైనంత త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం. లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా, పాలనను ప్రజల వద్దకే తీసుకురావాలన్నదే మా సంకల్పం. ప్రతి ఒక్కరి దరఖాస్తును పరిశీలించి, అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు, న్యాయం చేకూరేలా చూస్తాం" అని హామీ ఇచ్చారు.

తమ సమస్యలను నేరుగా మంత్రి గారికి చెప్పుకునే అవకాశం కల్పించడంపై, అలాగే మంత్రి సీతక్క చూపిన చొరవ మరియు ఆప్యాయతపై ప్రజా దర్బార్‌కు వచ్చిన ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా లికలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్‌లి మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి గారు ప్రత్యేక చొరవతో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలకు మరింత సేవ చేయాలనే మంచి ఉద్దేశంతో నిర్వహించడం జరిగిందని ఈ ప్రజా దర్బారు ద్వారా వచ్చిన ప్రతి ఒక్క దరఖాస్తును పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలను అందించి వారికి న్యాయం చేయడం కోసం జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని తెలిపారు, ప్రతి అంశాన్ని అతి ప్రాధాన్యతగా తీసుకోవాలని అధికారులను ఆదేశించారు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియలో ప్రైవేటు సంస్థతో ఒప్పందం చేసుకొని లబ్ధిదారులకు ఇండ్లు నిర్మించి ఇచ్చుట కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు, గ్రామీణ ప్రాంతాలలో చెక్ డ్యాములు రోడ్లు కరెంటు లైట్లు, తదితర అంతర్గత అభివృద్ధి పనుల పై ప్రత్యేక చర్యలు తీసుకొని ముందుకు సాగుతామని మంత్రి గారికి తెలిపారు,అనంతరం కొత్తగూడ మండల పరిధిలో ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నా పిల్లలను మంత్రి సన్మానించారు,ఈరోజు నిర్వహించిన ప్రజా దర్బార్ లో ఓటాయి గ్రామంలో (167), కొత్తగూడ రైతు వేదికలో (142) మొత్తం (309) దరఖాస్తులు వచ్చాయని, అట్టి దరఖాస్తుల పరిష్కారానికి జిల్లా కేంద్రంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి అన్ని సంబంధిత విభాగానికి పంపి పరిష్కారం తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగిందని లిజిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్‌లి తెలిపారు,ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో ములుగు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగ కళ్యాణి, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, అన్ని విభాగాల జిల్లా అధికారులు, తహసిల్దార్ రాజు, ఎంపీడీవో మునవర్ బేగ్, అన్ని గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# .మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కాలే యాదయ్య.



**• శంకర్ పల్లిలో ఇందిరమ్మ చీరల పంపిణీ -- మహిళా వ్యాపారస్తులకు ఉదయం పోర్టల్ నమోదు.**

**•మహిళా సంక్షేమం, రైతు అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే.**

రంగారెడ్డి జిల్లా :శంకర్పల్లి :మే 27: అక్షరం న్యూస్

రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో పని చేస్తున్నదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25వ తేదీ నుండి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఉమెన్ థీమాటిక్ వీక్ కార్యక్రమాలలో భాగంగా బుధవారం శంకర్ పల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ హెచ్ జి మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసి, మహిళా సంఘాల సభ్యులతో ఎమ్మెల్యే ఆత్మీయంగా మాట్లాడారు. అనంతరం మహిళా చిరు వ్యాపారస్తులకు ఉదయం పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లు చేయించి ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలపై అవగాహన కల్పించారు. మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో ముందుకు వచ్చి ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే తెలిపారు. మహిళల అభివృద్ధే కుటుంబ, సమాజ అభివృద్ధికి బాటలు వేస్తుందని పేర్కొన్నారు. మహిళా సంఘాల ద్వారా చిన్న వ్యాపారాలు పెద్ద స్థాయికి చేరుకునేలా ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కాలే యాదయ్య చెప్పారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందజేసి స్వయం ఉపాధి అవకాశాలను పెంచుతున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించి కుటుంబాలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు.రైతు సంక్షేమం విషయంలో కూడా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇప్పటికే రైతు రుణాలను మాఫీ చేయడంతో పాటు రైతుబంధు నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. రైతు, మహిళ, పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూలకంటి శ్వేతా పాండంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఏ. యోగేష్, మేనేజర్ వి. అంజన్ కుమార్, టీఎంసీ జి. వినోద్ కుమార్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మాజీ కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జవహర్లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా హ్యాబిట్స్‌లో ఘన నివాళులు.

- దేశ నిర్మాణంలో నెహ్రూ సేవలు చిరస్మరణీయం : కడమంచి ముత్తయ్య.
- హ్యాబిట్స్‌లో కాంగ్రెస్ నాయకుల పూలమాలలతో నివాళి కార్యక్రమం.



రంగారెడ్డి జిల్లా / శంకరపల్లి / మే 27/ అక్షరం న్యూస్ -:

భారత తొలి ప్రధానమంత్రి జవహర్లల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా హ్యాబిట్స్‌లో బుధవారం ఘనంగా నివాళు లర్పించారు. ఎస్‌సీసీఎల్ వైస్ చైర్మన్ కడమంచి ముత్తయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఖరీదాబాద్ ఇన్‌చార్జి రోహిత్ రెడ్డి, సెక్రటరీ నిర్మల యాదవ్, మామిడి కృష్ణ, గుజ్జుల రమేష్ తదితరులు పాల్గొన్నారు. నాయకులు నెహ్రూ దేశానికి అందించిన సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలు నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కడమంచి ముత్తయ్య మాట్లాడుతూ, స్వాతంత్ర్యానంతరం దేశ అభివృద్ధికి జవహర్లల్ నెహ్రు చేసిన కృషి మరువలేనిదని అన్నారు. విద్య, పారిశ్రామిక రంగం, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి నెహ్రూ తీసుకున్న నిర్ణయాలు దేశ ప్రగతికి బలమైన పునాది వేశాయని తెలిపారు. దేశ ఐక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణలో నెహ్రూ పాత్ర ఎంతో గొప్పదని నాయకులు కొనియాడారు. యువత నెహ్రూ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. హ్యాబిట్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికులు, కార్యకర్తలు పాల్గొని నెహ్రూకు ఘన నివాళులు అర్పించారు.

## 50 కోట్లతో నిర్మించే ఆర్నకొండ మల్యాల డబుల్ రోడ్డుకి శంకుస్థాపన



చొప్పదండి /కరీంనగర్,మే27 (అక్షరం న్యూస్ )

చొప్పదండి మండలం అర్నకొండ గ్రామం నుండి మల్యాల ఇ రోడ్డు వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రెండు వరుసల రహదారి నిర్మాణ పనులకు 50 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి బుధవారం రోజున కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తో కలిసి చొప్పదండి శాసన సభ్యులు మేడిపల్లి సత్యం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం తీసుకుని నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఉత్తమ నియోజక వర్గంగా తీర్చిదిద్దేలా కృషి చేస్తానన్నారు. ఈ రోడ్డు వల్ల నియోజకవర్గంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం కొండగట్టుకు వెళ్ళడానికి భక్తులకు మరియు ప్రయాణికులకు చాలా సులభతరం అవుతుందని త్వరితగతిన పనులు పూర్తి చేసి తొందర్లోనే అందుబాటులోకి తెస్తామన్నారు. ఇట్టి కార్యక్రమం లో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ పాలక వర్గం, పలువురు సర్పంచ్ లు, ఉప సర్పంచులు, మార్కెట్ పాలకవర్గం,గ్రామ శాఖ అధ్యక్షులు,నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తుంది

- కాంగ్రెస్ ప్రభుత్వం..
- వైరా మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 27 వైరా (అక్షరం న్యూస్)

ప్రజా సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తామని వైరా మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు అన్నారు. రాత్రి కురిసిన వర్షానికి 13వ వార్డులో మురికి కాల్వ పైప్ లైన్ జామ్ అవగానే బుధవారం జెసిబి పిలిపించి దగ్గరుండి జెసిబి ద్వారా పైప్లైన్ తీపిస్తున్న 13 వార్డ్ కౌన్సిలర్ మరియు మున్సిపల్ తొలి వైస్ చైర్మన్ ముళ్ళపాటి విజయ సీతారాములు వీరితోపాటు మున్సిపల్ ఏఈ శానిటైజ్ ఇన్స్పెక్టర్ వాటర్ వర్క్స్ శానిటేషన్ సిబ్బంది మరియు వార్డు ప్రజలు రేచర్ల పుల్లయ్య పెద్దపల్లి రఘు తోట సతీష్ కుమార్ కంభంపాటి సత్యనారాయణ మునిగే రాములు షేక్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

# విదేశాల్లో భారతీయ విద్యార్థుల దయనీయ పరిస్థితి

- ఒక పూట భోజనం.. కిలోమీటర్ల నడక.. మనుగడ కోసం పోరాటం.
- రూపాయి పతనంతో విద్యార్థుల జీవితాలు అస్తవ్యస్తం : నీరుడు సర్వేశ్ ముదిరాజ్ ఆవేదన.
- ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు, ఆర్థిక సాయం అందించాలి : ప్రభుత్వాలకు విజ్ఞప్తి.

రంగారెడ్డి జిల్లా :శంకర్పల్లి :మే 27: అక్షరం న్యూస్ -:

డాలర్‌తో పోలిస్తే భారతీయ రూపాయి విలువ రోజురోజుకూ క్షీణిస్తుండటం వల్ల విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న లక్షలాది మంది భారతీయ విద్యార్థుల జీవితాలు తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడుతున్నాయని మొయినాబాద్-రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నీరుడు సర్వేశ్ ముదిరాజ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విదేశాలకు వెళ్లిన మధ్యతరగతి, సామాన్య కుటుంబాల విద్యార్థులు నేడు చదువుకంటే మనుగడ కోసం ఎక్కువగా పోరాడాల్సిన పరిస్థితి నెలకొనడం అత్యంత దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూపాయి విలువ పడిపోవడం కేవలం ఆర్థిక రంగానికే పరిమితమైన అంశం కాదని, దీని ప్రభావం నేరుగా విదేశాల్లో చదువుతున్న విద్యార్థులపై పడుతోందన్నారు. అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో జీవన వ్యయం అమాంతం పెరగడంతో భారతదేశం నుంచి తల్లిదండ్రులు పంపిస్తున్న డబ్బు అక్కడి కనీస అవసరాలకు కూడా సరిపోవడం లేదన్నారు. అద్దె గదులు, ఆహారం, ప్రయాణ ఖర్చులు, వైద్య సేవలు, విద్యా ఫీజులు అన్నీ భారీగా పెరగడంతో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. చాలా మంది విద్యార్థులు ఖర్చులు తగ్గించుకోవడానికి రోజుకు ఒక్క పూట మాత్రమే భోజనం చేస్తూ, కొన్నిసార్లు ఆకలితోనే గడుపుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు విద్యార్థులు పాలు, బ్రెడ్, నూడుల్స్ వంటి తక్కువ ఖర్చుతో వచ్చే ఆహారంతోనే



రోజులు గడుపుతున్నారని తెలిపారు. పోషకాహారం అందక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నప్పటికీ పరిస్థితుల దృష్ట్యా వారు మౌనంగా భరిస్తున్నారని అన్నారు. కుటుంబ సభ్యులకు తమ కష్టాలు చెప్పినా వారు ఆందోళన చెందుతారనే భావనతో చాలా మంది విద్యార్థులు బాధలను దాచిపెడుతున్నారని పేర్కొన్నారు. బస్సు, మెట్రో, సబ్‌వే ఛార్జీలు కూడా భరించలేని స్థితి రావడంతో విద్యార్థులు నిత్యం కిలోమీటర్ల కొద్దీ కాలినడకన ప్రయాణిస్తున్నారని ఆయన తెలిపారు. చలికాలంలో మంచు వాతావరణంలోనూ, వర్షాల్లోనూ, రాత్రి వేళల్లోనూ నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోందని అన్నారు. ఈ కారణంగా విద్యార్థులు తీవ్రమైన శారీరక అలసటతో పాటు అనారోగ్య సమస్యలను కూడా ఎదుర్కొంటున్నారని తెలిపారు. జీవనోపాధి కోసం చదువుతో పాటు అనేక పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని నీరుడు సర్వేశ్ ముదిరాజ్ పేర్కొన్నారు. అధికారిక పార్ట్‌టైమ్ ఉద్యోగాలతో పాటు డిపార్ట్‌మెంటల్ స్టోర్లు, రెస్టారెంట్లు, గ్యాస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో ఫ్లోర్లు తుడవడం, సరుకులు మోసే పనులు చేయడం వంటి కష్టమైన పనులు కూడా విద్యార్థులు చేస్తున్నారని తెలిపారు. కొందరు విద్యార్థులు రాత్రి పూట పని చేసి ఉదయం తరగతులకు హాజరవుతూ నిద్రలేమితో బాధపడుతున్నారని చెప్పారు. ఈ పరిస్థితుల వల్ల విద్యార్థులు చదువుపై పూర్తిగా దృష్టి పెట్టలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆకలి, అలసట, ఆర్థిక ఒత్తిడి కారణంగా విద్యా నైపుణ్యాలు దెబ్బతింటున్నాయని, గ్రేడ్‌లు పడిపోతున్నాయని తెలిపారు. ఎన్నో ఆశలతో విదేశాలకు వెళ్లిన విద్యార్థులు మానసికంగా కుంగిపోతూ, కొందరు తీవ్ర నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు. విదేశాల్లో ఒంటరితనం, ఆర్థిక భారం, ఉద్యోగ ఒత్తిడి కలిసి యువత మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని అన్నారు. దేశ భవిష్యత్తుకు బలమైన ఆస్తిగా నిలవాల్సిన యువత విదేశీ గడ్డపై కనీస అవసరాల కోసం అల్లాడిపోవడం బాధాకరమని ఆయన అన్నారు. విదేశాల్లో ఉన్న భారతీయ విద్యార్థుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యవసరంగా పరిగణించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు, అత్యవసర ఆర్థిక సహాయం, తక్కువ వడ్డీ విద్యా రుణాలు, కౌన్సెలింగ్ సదుపాయాలు అందించేలా ప్రభుత్వాలు ముందుకు రావాలని సూచించారు. విదేశాల్లో చదువుతున్న భారతీయ విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, భారత రాయబార కార్యాలయాలు, విద్యా సంస్థలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని నీరుడు సర్వేశ్ ముదిరాజ్ అభిప్రాయపడ్డారు. రూపాయి పతనాన్ని కేవలం ఆర్థిక గణాంకాల కోణంలోనే కాకుండా దాని వెనుక ఉన్న మానవీయ కోణాన్ని కూడా గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విదేశీ విద్య కోసం వెళ్లిన భారతీయ యువత తమ లక్ష్యాలను సాధించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# జిల్లా ఆసుపత్రిలో క్లిష్టమైన భుజం శస్త్రచికిత్స విజయవంతం

- ఆర్థోపెడిక్ విభాగం వైద్యుల ప్రతిభ.
- అత్యాధునిక పద్ధతిలో విరిగిన ఎముకకు ప్లేట్లు, స్క్రూల అమరిక.

పెద్దపల్లి జిల్లా/ పెద్దపల్లి టౌన్/ మే 27/ అక్షరం న్యూస్ -

పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో క్లిష్టమైన భుజం శస్త్రచికిత్సను వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసింది. జిల్లా కేంద్రానికి చెందిన 50 ఏళ్ల వ్యక్తి రోడ్డు ప్రమాదంలో కుడి భుజం ఎముక విరిగి తీవ్రమైన నొప్పితో జిల్లా ఆసుపత్రికి చేరుకున్నారు. ఆసుపత్రిలోని ఆర్థోపెడిక్ విభాగం వైద్యులు వెంటనే స్పందించి రోగిని పరీక్షించగా, ఎముక విరిగినట్లు ఎక్స్ రే ద్వారా నిర్ధారణ అయింది. అయితే, రోగికి 120 కేజీల బరువు ఉండటం వల్ల మరియు గతంలో మత్తు ఇచ్చేందుకు చేసిన ప్రయత్నం విఫలం కావడంతో వైద్యులకు ఈ ఆపరేషన్ సవాలుగా మారింది. ఈ క్లిష్ట సమయంలో రోగి భద్రత దృష్ట్యా, అల్ట్రాసౌండ్ మెషిన్ సహాయంతో లోకల్ అనస్థీషియా బ్లాక్ ఇచ్చేందుకు నిష్ణాతులైన వైద్యుడు మహేశ్వర్ రెడ్డిని ప్రత్యేకంగా పిలిపించారు. ఆ తర్వాత సీనియర్ ఆర్థోపెడిక్ డాక్టర్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో



డాక్టర్ వినయ్, డాక్టర్ మేఘనలతో కూడిన బృందం సుదీర్ఘ శ్రమతో ఓఆర్ఐఎఫ్ విత్ సీసీ స్క్రూ ప్లేటింగ్ అనే శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ శస్త్రచికిత్సలో విరిగిన ఎముక భాగాలను పూర్తిగా సరిచేసి, ప్రత్యేకమైన ప్లేట్లు, స్క్రూల సహాయంతో ఎముక కదలకుండా స్థిరపరిచారు. ఈ ప్రక్రియలో అనస్థీషియా వైద్యులు మహేశ్వర్ రెడ్డి, భవాని, స్వాతి కీలక పాత్ర పోషించారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో కూడా ఆపరేషన్‌ను విజయవంతం చేసిన వైద్య బృందాన్ని, ఓటీ సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ కొండ శ్రీధర్ అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటువంటి ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉండటం పట్ల రోగి బంధువులు హర్షం వ్యక్తం చేశారు

# స్నేహితుని కుటుంబానికి ఆర్థిక చేయూత

జఫర్ గడ్,మే27, అక్షరంన్యూస్: జనగామ జిల్లా జఫర్ గడ్ మండలంలోని వడ్డే గూడెం గ్రామానికి చెందిన కుక్కల రాజేందర్ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పదవ తరగతి 2010-2011 బ్యాచ్ స్నేహితులు అందరూ కలిసి రూ. 26.500 నగదు,50 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా వారికి పలువురు గ్రామస్తులు అభినందనలు తెంలిపారు. కలిసి చదువుకున్న స్నేహితులు అందరూ కలిసి స్నేహితుని కుటుంబానికి అండగా ఉంటామని వారు బాధిత కుటుంబం సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో 2010-2011 పదవ తరగతి బ్యాచ్ స్నేహితులు పాల్గొన్నారు.



## వేసవిలో ఫైబర్ అధికంగా తీసుకుంటున్నారా.. అయితే ఈ సమస్యలు వస్తాయి జాగ్రత్త




వేసవిలో ఆరోగ్యంగా ఉండాలంటే ఎక్కువగా సలాడ్లు తినాలని చాలామంది భావిస్తారు. ముఖ్యంగా బరువు తగ్గడం, శరీరానికి ఫైబర్ అందించడం కోసం ముడి కూరగాయలతో చేసిన సలాడ్లను ఆహారంలో భాగం చేసుకుంటున్నారు. అయితే తీవ్ర ఎండల్లో అధికంగా ముడి సలాడ్లు తినడం వల్ల కడుపు ఉబ్బరం, గ్యాస్, జీర్ణ సమస్యలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా శరీరం వేడికి గురయ్యే వేసవి కాలంలో జీర్ణక్రియ సున్నితంగా మారుతుందని చెబుతున్నారు. ఫైబర్ శరీరానికి అవసరమైన పోషకాల్లో ఒకటి. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో, మలబద్ధకాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. కానీ అధికంగా తీసుకుంటే అదే ఫైబర్ కడుపులో ఇబ్బందులకు కారణమవుతుందని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఒక్కసారిగా ఎక్కువ మోతాదులో ముడి సలాడ్లను తినడం వల్ల గ్యాస్, ఉబ్బరం, కడుపు మంట, క్రాంప్స్ వంటి సమస్యలు వస్తాయని అంటున్నారు.

### గ్యాస్ ఇలా ఏర్పడుతుంది

వేసవిలో శరీరంలో నీటి శాతం తగ్గిపోవడం వల్ల జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. అలాంటి సమయంలో ముడి కూరగాయల్లో ఉండే అధిక ఫైబర్‌ను జీర్ణం చేయడం పొట్టకు కష్టమవుతుంది. దీంతో ఆ ఫైబర్ జీర్ణాశయం (గట్)లో ఫర్మెంటేషన్‌కు గురై గ్యాస్ ఏర్పడే అవకాశం పెరుగుతుంది. ఫలితంగా కడుపు బిగుసుకుపోయినట్టు అనిపించడం, ఉబ్బరం, అసౌకర్యం వంటి సమస్యలు ఎక్కువవుతాయి. నిపుణుల ప్రకారం ముడి సలాడ్లు అధికంగా తినడం వల్ల కడుపులో ఫైబర్ పరిమాణం ఒక్కసారిగా పెరుగుతుంది. దీంతో గ్యాస్ ఫార్మేషన్, అబ్డోమినల్ బ్లోటింగ్ వంటి సమస్యలు వస్తాయి. ముఖ్యంగా ఇర్రిటబుల్ బవెల్ సిండ్రోమ్ (ఐబీఎస్) ఉన్నవారిలో ఈ ఇబ్బందులు మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. శరీరంలో ఫైబర్ అధికమైందని సూచించే కొన్ని లక్షణాలు కూడా ఉంటాయి. తరచూ కడుపు ఉబ్బరంగా ఉండటం, ఎక్కువ గ్యాస్ సమస్య, కడుపు నొప్పి లేదా క్రాంప్స్, ఎప్పుడూ కడుపు నిండిన భావన ఉండటం వంటి సంకేతాలు కనిపిస్తే ఫైబర్ మోతాదును పరిశీలించాల్సిన అవసరం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

### వీరు జాగ్రత్తగా ఉండాలి

ముఖ్యంగా వేసవిలో కొంతమంది ఆహారం తీసుకునే విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఐబీఎస్, జీర్ణక్రియ బలహీనంగా ఉన్నవారు, పిల్లలు, వృద్ధులు, అలాగే ఒక్కసారిగా హై-ఫైబర్ డైట్ ప్రారంభించినవారు జాగ్రత్తగా ఉండాలి. వీరిలో శరీరం ఫైబర్‌ను సరిగ్గా జీర్ణం చేయలేక సమస్యలు పెరిగే అవకాశం ఉంటుంది. వేసవిలో ఫైబర్‌ను సరైన విధంగా తీసుకోవడం చాలా ముఖ్యం. ముడి కూరగాయలకంటే స్వల్పంగా ఉడికించిన కూరగాయలను తినడం జీర్ణక్రియకు సులభంగా ఉంటుంది. ఫైబర్‌ను ఒక్కసారిగా కాకుండా క్రమంగా పెంచడం మంచిది. తగినంత నీరు తాగడం కూడా చాలా అవసరం. ఎందుకంటే నీరు లేకపోతే ఫైబర్ కడుపులో మరింత అసౌకర్యాన్ని కలిగిస్తుంది.

### మిశ్రమ ఆహారం తీసుకోవాలి

ప్రోటీన్, ప్రోబయోటిక్స్ ఉన్న ఆహారంతో ఫైబర్‌ను సమతుల్యం చేస్తే జీర్ణవ్యవస్థకు మేలు జరుగుతుంది. సలాడ్లు తిన్న తర్వాత తీవ్రమైన ఉబ్బరం, భోజనం తర్వాత నొప్పి, రోజంతా కొనసాగే జీర్ణ సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. మందులు వేసుకున్నా సమస్య తగ్గకపోతే నిర్లక్ష్యం చేయకూడదు. ఫైబర్ శరీరానికి ఎంతో అవసరం అయినప్పటికీ, మోతాదు, తీసుకునే విధానం చాలా ముఖ్యం. ముఖ్యంగా వేసవిలో శరీర పరిస్థితిని బట్టి ఆహారపు అలవాట్లు మార్చుకోవడం అవసరం. పొట్ట ఇచ్చే సంకేతాలను గమనిస్తూ, తగిన మోతాదులో ఫైబర్ తీసుకోవడం ద్వారా జీర్ణ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

# మొక్కజొన్న కొనుగోళ్ళు వేగవంతం చేయాలి

- -రైతులను పట్టించుకోని చొప్పదండి ఎమ్మెల్యే
- గన్ని సంచుల కొరత నివారించాలి
- చొప్పదండి మార్కెట్ కొనుగోలు కేంద్రంలో అన్నదాతల అరిగోస
- సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



చొప్పదండి /కరీంనగర్,మే 27 (అక్షరం న్యూస్ )

ఆరుగాలం కష్టించి, అనేక వ్యయ ప్రయాసాలకు ఓర్చి తాము పండించిన, వరి ధాన్యం, మొక్కజొన్న పంటలను అమ్ముకునేందుకు కొనుగోలు సెంటర్కు వచ్చిన రైతులకు 20 రోజులుగా నిరీక్షణ తప్పడం లేదనీ వెంటనే కొనుగోళ్ళు వేగవంతం చేయాలని, గన్నీ సంచుల కొరత నివారించాలని సిపిఎం పార్టీ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం రోజున చొప్పదండి వ్యవసాయ మార్కెట్ యార్డులోని మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు సెంటర్ ను సందర్శించి, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్ కార్యదర్శి రాజేశ్వరి గారికి రైతాంగ సమస్యలు పరిష్కరించాలని, మార్కెట్లో మధ్య దళారుల దోపిడిని అరికట్టాలని, రైతులకు సరిపడా గన్ని సంచులు తెప్పించాలని, తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న ప్రైవేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. వారం రోజుల్లో మార్కెట్లో ఉన్న దాన్యం మొక్కజొన్న పంటను పూర్తిగా కొనుగోలు చేస్తామని, రైతుల సమస్యలను పరిష్కరిస్తామని రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్ళు వేగవంతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ చొప్పదండి మార్కెట్ కొనుగోలు సెంటర్లో అన్నదాతలు ఇబ్బందులు పడుతుంటే స్థానిక ఎమ్మెల్యే రైతుల సమస్యలు పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే అయ్యుండి కూడా రైతుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైనడన్నారు. కొనుగోలు సెంటర్లలో పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతున్న స్థానిక శాసనసభ్యులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. వెంటనే జోక్యం చేసుకొని కొనుగోలు సెంటర్లలో సమస్యలు పరిష్కరించి రైతాంగానికి అండగా ఉండాలన్నారు. కొనుగోలు కేంద్రంలో 20 రోజులుగా రైతులు మార్కెట్లో జాగారం చేస్తున్నా, పట్టించుకునే ప్రజా ప్రతినిధులు, అధికారులు లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి మొక్కజొన్న,ధాన్యం తడిసిందని, తడిసిన ధాన్యాన్ని మొక్కజొన్న పంటను ఎలాంటి కొర్రీలు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కాంటాలు అయిన మొక్కజొన్న ను లోడింగ్ చేయకపోవడం మూలంగా బస్తాల వద్ద రోజుల తరబడి పడి కాపులు తప్పడం లేదన్నారు. వెంటనే కొనుగోళ్ళు యుద్ధ ప్రాతిపదికన జరపాలని, తూకం వేసిన బస్తాలు అదే రోజు లిఫ్ట్ చేయాలని డిమాండ్ చేశారు. గన్ని సంచుల కొరత తీవ్రంగా ఉందని, అధికారులే రైతులను గన్ని సంచులు తెచ్చుకోవాలని చెప్తున్నారని, విధి లేని పరిస్థితిలో రైతులు గన్ని సంచులు కొనుగోలు చేస్తున్నారన్నారు. సుతిలి దారం సైతం రైతే కొనుగోలు చేసుకునే పరిస్థితి రావడం సిగ్గుచేటు అన్నారు. అధికారులకు ముందస్తు ప్రణాళికలు లేకపోవడం మూలంగా పంటను మద్దతు ధరకు అమ్ముకోవడం కోసం మార్కెట్లో అన్నదాతలు ప్రతినిత్యం అరిగోస పడుతున్నారన్నారు. ముఖ్యంగా మార్క్ పేడ్ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. -ఎద్దు ఏడ్చిన ఎవుసం' -రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడ్డది చరిత్రలో లేదన్నారు' రవాణా కోసం లారీల సమస్య తీవ్రంగా ఉందని, జిల్లా అధికారులు జోక్యం చేసుకొని లారీల కొరతను తీర్చాలన్నారు. క్వింటాల్కు 15 రూపాయలు రవాణా చార్జీల కోసం అక్రమంగా వసూలు చేస్తున్నారని అన్నారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాల్సిన జిల్లా అధికార యంత్రాంగం, మంత్రులు, ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నట్లనీ ప్రశ్నించారు. ఒకవైపు అకాల వర్షాలు పడుతున్న కొనుగోళ్ళు వేగవంతం చేయకపోవడం ఆందోళన కలిగిస్తుంది అన్నారు. మార్ఫెడ్ సిబ్బంది తగినంతగా లేకపోవడం మూలంగా కొనుగోళ్ళు ఆలస్యం అవుతున్నాయి అన్నారు. వెంటనే తగినంత సిబ్బందిని నియమించి కొనుగోళ్ళు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు తర్వాత రైతుల వేలిముద్రలు రాకపోవడం మూలంగా అనేక మంది రైతులు తాము పండించిన పంటను మద్దతు దరకు అమ్ముకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేలిముద్రలకు ప్రత్యామ్నాయంగా ఐరిష్ తీసుకోవాలన్నారు. కొనుగోలు సెంటర్లలో సరిపడా సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ఏలాంటి పైరవీలకు, రాజకీయ ఒత్తిళ్లకు తావు లేకుండా రైతుల పంటలను ప్రాధాన్యత క్రమంలో కొనుగోలు చేసి, కాటా వేయాలని డిమాండ్ చేశారు. కనీస మద్దతు ధరకు, బహిరంగ మార్కెట్లో ధరకు సుమారు క్వింటాల్కు 500 నుండి600 వరకు వ్యత్యాసం ఉండడంతో మధ్య దళారులు రైతుల బలహీనతను ఆసరా చేసుకుని దోచుకుంటున్నారన్నారు. ఎప్పుడు లేని విధంగా రైతులకు నిబంధనలను విధించడం సిగ్గుచేటు అన్నారు.

మొక్కజొన్న ఎకరానికి 25 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని అధికారులు చెప్తున్నారని, ఎకరానికి 30 నుండి 40 క్వింటాళ్ల పంట రైతు చేతికి వస్తుందని మిగతా పంటను ఎక్కడ అమ్ముకోవాలో అధికారులే చెప్పాలని డిమాండ్ చేశారు. నిబంధనలు తొలగించి రైతు పండించిన పంట మొత్తం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు సెంటర్లలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో అధికారుల పర్యవేక్షణ నామమాత్రంగానే ఉందని, జిల్లా అధికారులే ప్రతినిత్యం పర్యవేక్షణ చేయాలని డిమాండ్ చేశారు.ప్రజా ప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా, రైతులకు అండగా ఉండాలన్నారు.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని, పది లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే కేంద్రం కొనుగోలు చేస్తుందని, మిగతా 30 లక్షల టన్నుల బియ్యాన్ని ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్న పంటను ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు.రాష్ట్రంలో పండించిన ప్రతి పంటను కొనుగోలు చేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే అన్నారు. కొనుగోలుచేసే పాత్ర నుండి, విమర్శించే పాత్రకు రావడం బీజేపీ దివాలాకోరు రాజకీయ విధానాలకు నిదర్శనం అన్నారు.ప్రారంభంలోనే విక్రయించిన వరి ధాన్యం ,మొక్కజొన్న పంటల డబ్బులు రైతుల అకౌంట్లో వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు.పంట పండించుటకు పెట్టుబడులు, కౌలు, కూళ్ళు ఇవ్వాల్సి ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఉప్పునూటి శ్రీనివాస్, మండల కన్వీనర్ గంగిపెల్లి కుమార్, మాఊరపు శ్రీనివాస్,మారం సత్తయ్య,అశోక్,గంగారం తదితరులు పాల్గొన్నారు.

## చెమట విపరీతమైన దుర్వాసన వస్తుందా అయితే అందుకు కారణాలు ఇవే

చెమట శరీరానికి సహజసిద్ధమైన శీతలీకరణ వ్యవస్థల్లో ఒకటి. ఇది శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంలో, చర్మ సమతుల్యతను కాపాడడంలో నిశ్శబ్దంగా పనిచేస్తూ ఉంటుంది. సాధారణంగా వ్యాయామం చేసినప్పుడు, ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు లేదా ఒత్తిడి పరిస్థితుల్లోనే చాలామంది చెమటను గమనిస్తారు. అయితే కొన్నిసార్లు చెమట కేవలం వేడిని తగ్గించే ప్రక్రియ మాత్రమే కాకుండా, శరీరంలో జరుగుతున్న కొన్ని ఆరోగ్య మార్పులకు సంకేతంగా కూడా మారుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. చెమటకు స్వతహాగా ఎలాంటి వాసన ఉండదని, అది చర్మంపై ఉండే బ్యాక్టీరియాతో కలిసినప్పుడు మాత్రమే దుర్వాసన వస్తుందని వైద్యులు వివరిస్తున్నారు. అయితే కొన్ని సందర్భాల్లో శరీర వాసనలో అకస్మాత్తుగా మార్పులు కనిపిస్తే అవి అంతర్గత ఆరోగ్య సమస్యలకు సూచన కావచ్చని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా తీపి వాసన, అమోనియా లాంటి ఘాటైన వాసన లేదా బూజు వాసనలాంటివి మెటబాలిజం మార్పులు, డీహైడ్రేషన్ లేదా ఇతర వ్యాధులతో సంబంధం ఉంటాయని చెబుతున్నారు.

# రోజూ మామిడి పండును తింటే శరీరంలో ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటాయి

వేసవి వచ్చిందంటే చాలు చాలామందికి ముందుగా గుర్తుకొచ్చే పండు మామిడిపండు. తీపి రుచి, సువాసనతోపాటు దీన్ని పోషకాల పరంగా కూడా ఎంతో విలువైనదిగా భావిస్తారు. అయితే ప్రతిరోజూ మామిడి తింటే శరీరంలో ఏం మార్పులు జరుగుతాయి? సరైన మోతాదులో తీసుకుంటే ఇది ఆరోగ్యానికి ఎలా ఉపయోగపడుతుంది? అనే విషయాల గురించి పోషకాహార నిపుణులు వివరిస్తున్నారు. ఒక కప్పు మామిడి ముక్కల్లో సుమారు 99 క్యాలరీలు, 25 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 2.6 గ్రాముల ఫైబర్‌తో పాటు విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ ఇ, ఫోలేట్, పొటాషియం, కాపర్ వంటి పోషకాలు లభిస్తాయి. అందుకే మామిడి కేవలం తీపి పండు మాత్రమే కాకుండా శరీరానికి ఉపయోగపడే పోషకాల నిల్వగా కూడా చెప్పవచ్చు. అయితే ఇందులో సహజ చక్కెరలు ఎక్కువగా ఉండటంతో మోతాదు నియంత్రణ చాలా ముఖ్యం.

### తక్షణ శక్తి, ఫైబర్ ప్రభావం

ప్రతిరోజూ మామిడి తినడం ప్రారంభించిన మొదటి వారంలోనే శరీరానికి తక్షణ శక్తి అందుతుంది. సహజ కార్బోహైడ్రేట్లు త్వరగా ఎనర్జీ ఇస్తాయి. ఫైబర్ జీర్ణక్రియను కొంత నెమ్మదిగా చేసి ఎక్కువసేపు తృప్తి కలిగిస్తుంది. విటమిన్ సి రోగనిరోధక శక్తికి మద్దతు ఇవ్వడమే కాకుండా మొక్కల ఆధారిత ఆహారాల్లోని ఐరన్‌ను శరీరం బాగా గ్రహించేందుకు సహాయపడుతుంది. ప్యాకెట్ స్నాక్స్ లేదా చక్కెర పానీయాల స్థానంలో మామిడి తీసుకుంటే తేలికైన ఆహారపు అలవాట్లు ఏర్పడే అవకాశం ఉంటుంది. రెండో వారానికి వచ్చేసరికి మామిడిలోని ఫైబర్ ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఇది మలబద్ధకాన్ని తగ్గించి జీర్ణక్రియను సక్రమంగా ఉంచడంలో సహాయపడుతుంది. నీటి శాతం ఎక్కువగా ఉండటంతో శరీరానికి తేమను కూడా అందిస్తుంది. అయితే మితిమీరిన మోతాదులో తింటే కొంతమందిలో చక్కెర ప్రభావం ఎక్కువగా కనిపించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా డయాబెటిస్ లేదా ప్రీడయాబెటిస్ ఉన్నవారు పరిమిత మోతాదులో మాత్రమే తీసుకోవాలి. మూడో వారానికి మామిడిలోని పోషకాల అసలు ప్రయోజనం కనిపించడం ప్రారంభమవుతుంది.

### వ్యాయామం చెమట, ఒత్తిడి ఉన్నప్పుడు వచ్చేది ఒక్కటే కాదు..

వ్యాయామం చేసినప్పుడు వచ్చే చెమట, ఒత్తిడి సమయంలో వచ్చే చెమట ఒకేలా ఉండదు. శరీరాన్ని చల్లబరచేందుకు వచ్చే సాధారణ చెమట ఎక్కువగా నీరు, ఉప్పుతో కూడి ఉండి ఎక్కువ వాసన ఉండదు. కానీ ఒత్తిడి, ఆందోళన లేదా భావోద్వేగ పరిస్థితుల్లో వచ్చే చెమటలో ప్రోటీన్లు, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. వీటిని బ్యాక్టీరియా త్వరగా విచ్ఛిన్నం చేయడం వల్ల ఘాటైన దుర్వాసన ఏర్పడుతుంది. ఇంటర్వ్యూలు, వాగ్వాదాలు లేదా దీర్ఘకాలిక మానసిక ఒత్తిడి సమయంలో చెమట వాసన మరింత ఎక్కువగా ఉండటానికి ఇదే కారణం. నిద్రలేమి, అధిక కాఫీ సేవనం, ధూమపానం, మద్యం అలవాట్లు కూడా ఈ సమస్యను మరింత పెంచుతాయి. ఆధునిక జీవనశైలిలో శరీర వాసన సమస్య కేవలం పరిశుభ్రతకు మాత్రమే సంబంధించినది కాకుండా నరాల వ్యవస్థపై నిరంతర ఒత్తిడికి కూడా సంకేతంగా భావించాలి.

### అనారోగ్య సమస్యలకు సూచన..

కొన్ని ప్రత్యేకమైన వాసనలు అనారోగ్య సమస్యలను సూచిస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మధుమేహం నియంత్రణలో లేకపోతే శరీరం కొవ్వును వేగంగా కరిగించడం వల్ల కీటోన్లు అనే రసాయనాలు ఉత్పత్తి అవుతాయి. దీని కారణంగా తీపి లేదా పండ్ల వాసనలాంటి చెమట వాసన వస్తుంది. తీవ్రమైన పరిస్థితుల్లో ఇది డయాబెటిక్ కీటో ఆసిడోసిస్ అనే ప్రమాదకర పరిస్థితికి సంకేతమవుతుంది. అమోనియా లాంటి వాసన డీహైడ్రేషన్, అధిక ప్రోటీన్ ఆహారం లేదా కొన్ని సందర్భాల్లో కిడ్నీ సమస్యలకు సంకేతం అవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. అరుదుగా కనిపించే ఫిష్ ఒడర్ సిండ్రోమ్ అనే పరిస్థితిలో శరీరం చేపల వాసనలాగా దుర్వాసన విడుదల చేస్తుంది. అలాగే కాలేయ సమస్యల్లో బూజు వాసన, తీవ్రమైన కిడ్నీ వ్యాధుల్లో మూత్రం లాంటి వాసన వస్తాయి.

### ఈ సూచనలు పాటించాలి..

అధిక చెమటలు పట్టడం, శరీర వాసన మారడం వల్ల చాలామంది సామాజికంగా ఇబ్బంది పడతారని నిపుణులు చెబుతున్నారు. ఉద్యోగ స్థలాల్లో లేదా ప్రజల్లో ఉండేటప్పుడు దుర్వాసన వస్తుందేమో అనే భయం ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. అయితే దీనిని సిగ్గుపడాల్సిన విషయంగా కాకుండా, శరీరం ఇస్తున్న హెచ్చరికగా చూడాలి. శరీర వాసనను తగ్గించేందుకు కొన్ని సాధారణ అలవాట్లు సహాయపడతాయి. క్రమం తప్పకుండా స్నానం చేయడం, గాలి ఆడే దుస్తులు ధరించడం, తగినంత నీరు తాగడం వల్ల చెమట వాసన తగ్గుతుంది. వెల్లుల్లి, ఉల్లిపాయలు, మద్యం, అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారం శరీర వాసనను ప్రభావితం చేస్తాయి. పండ్లు, కూరగాయలు, నీరు ఎక్కువగా ఉండే సమతుల ఆహారం శరీర రసాయన సమతుల్యతను మెరుగుపరుస్తుంది. అలాగే తీవ్రమైన లేదా నిరంతరం మారుతున్న శరీర వాసనను కేవలం సువాసనలతో దాచిపెట్టకుండా,

# రాష్ట్ర ప్రభుత్వ పోత్సహంతో స్వయం సమృద్ధి దిశగా మహిళా సంఘాలు





-స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ జిల్లా /రఘునాధపల్లి/( అక్షరం న్యూస్) మే 27:మహిళలను ఆర్థికంగా మరింత్ బలోపేతం చేయడానికి ప్రభుత్వం అంకిత భావంతో కృషి చేస్తుందని, మహిళలు ఇంటికే పరిమితమన్న నానుడికి తిలోదకాలిచ్చి.. వారిని పారిశ్రామిక, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా నవభారతి మండల సమాఖ్యతో పాటు జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభుత్వ సహకారంతో మండలంలోని ఆశ్వరావుపల్లి గ్రామంలో రూ.2.90 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న ఒక మెగా వాట్ సోలార్ పవర్ ప్లాంట్ కు ఎమ్మెల్యే కడియం శ్రీహరి బు ధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి సర్పంచ్ పొన్నగంటి చైతన్యరాజు అధ్యక్షత వహించగా, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వాతంత్ర్యానికి ప్రభుత్వం పాధాన్యతనిస్తుందని, మహిళాల ఆర్థికాభివృద్దే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గతంలో మండల మహిళా సమాఖ్య ప్రభుత్వ సహకారంతో ఒక బస్సును కొనుగోలు చేసి, ఆర్టీసీకి అప్పగించడం ద్వారా నెలకు రూ.69 వేల ఆదాయం పొందుతున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఒక మెగా వాట్ సోలార్ పవర్ ప్లాంట్ ద్వారా సమాఖ్యకు నెలకు లక్ష రూపాయాల ఆదాయం లభించే అవకాశముందన్నారు. ప్రభుత్వం మహిళలను సంక్షేమ పథకాల లబ్దిదారులుగా కాకుండా వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుందని, మహిళలు తమ కుటుంబాలను పోషించడమే కాకుండా మరింత మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తుం దని అన్నారు. మహిళా సమాఖ్యలకు ఎరువుల దుకాణాలతో పాటు విత్తనాల విక్రయానికి జిల్లా స్థాయిలో చర్యలు చేపడుత ఉన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్డీవో భాస్కర్, ఏపిడి నూరోద్దిన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు, లింగాల జగదీష్ చందర్ రెడ్డి, రెడ్కో సంస్థ మేనేజర్ మహేందర్ రెడ్డి,మండల సమాఖ్య అధ్యక్షురాలు వసంత, ఐకేపీ ఏపిఎం వి నీల, తహసీల్దార్ రాజేష్ రెడ్డి, ఎంపిడివో గార్లపాటి శ్రీనివాసులు, ఐకెపీ సీసీలు ఎల్లస్వామి, రీనావతి, సరోజన, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.





# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి






• ఎమ్మెల్యే కోరం కనకయ్య, నూతి సత్యనారాయణ గౌడ్, పువ్వాళ్ళ దుర్గాప్రసాద్

ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 27 (అక్షరం న్యూస్)

కాంగ్రెస్ పార్టీని నిర్మాణాత్మకంగా, క్రింది స్థాయి నుంచి ప్రతిష్టపరిచి, కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని, నూతనంగా నియమించబడిన మండల అధ్యక్షులు ప్రమాణస్వీకారం కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఖమ్మం జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం నాడు ముచ్చర్ల స్థానిక వెంకటలక్ష్మి ఫంక్షన్ హాల్లో కామేపల్లి మండలం నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, జిల్లా కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ అరెం రవి, జిల్లా కిసాన్ సెల్ సభ్యులు సుంకిరెడ్డి దామోదర్ రెడ్డి ల ప్రమాణ స్వీకారోత్సవం మండల కాంగ్రెస్ నాయకులు డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏపూరి మహేందర్, టిపిసిసి నెంబర్ పుచ్చకాయల వీరభద్రం, పిఎసిఎస్ అధ్యక్షులు ధనియాకుల హనుమంతరావు, జిల్లా మహిళాధ్యక్షురాలు సౌజన్య, ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్. రాంబాబు, తోటకూరి శివయ్య, గబ్రు నాయక్ తదితరుల ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశంలో ఘనంగా జరిగింది. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చింది, కొట్లాడి తెచ్చింది కాంగ్రెస్ పార్టీ యే నని, కానీ గత టీఆర్ఎస్ ప్రభుత్వం మాయ మాటలతో, మోసపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి పది సంవత్సరాల పాటు పరిపాలించి తెలంగాణ అభివృద్ధిని, విచ్చిన్నం చేశాయని, తెలంగాణ దోపిడీకి గురైందని విమర్శించారు. ప్రాంతీయ పార్టీలు మతతత్వ పార్టీల బూటకపు వాగ్దానాలని నమ్మవద్దని హితవు పలికారు. రాజకీయాలు వర్గాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి రేవంత్ రెడ్డి హయాంలో ఆరు పథకాలు అమలవుతున్నాయని, ఇంకా దేశంలోనే అభివృద్ధిలో తెలంగాణ దూసుకుపోతుందని పేర్కొన్నారు. పార్టీ మహాసముద్రం లాంటిదని, ఏ పార్టీకి లేని విధంగా 140 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, ఇలాంటి అఖండ సముద్రమయమైన ఈ పార్టీలో వర్గాలు ఉండటం సహజమని, అయినా సరే ఎన్నికల సమయంలో అందరం ఒక్కటిగా నిలిచిపోతున్నామని, ఈ సాంప్రదాయం కాంగ్రెస్ పార్టీలో మాత్రమే ఉందని, కార్యకర్తలు బూతుల వారీగా, గ్రామాల వారిగా మండల స్థాయిలో కమిటీలు వేసుకొని పార్టీ సంస్థాగత నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా నియమించబడిన పార్టీ కమిటీ సభ్యులను శాలువాలతో పుష్పగుచ్చములతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాకు అప్పగించిన ఈ బాధ్యతను భారంగా కాకుండా వర్గాలకతీతంగా, ప్రతి ఒక్క కార్యకర్తను సమన్వయం చేసుకొని, పార్టీ అధిష్టానం పిలుపుమేరకు నడుచుకుంటామని వాగ్దానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జర్పల లక్ష్మణ్ నాయక్, మాజీ ఎంపీపీ, జడ్పిటిసి మా లోతు సరిరాం నాయక్, మాజీ జెడ్పిటిసి బానోత్ వెంకట్ ప్రవీణ్ నాయక్, ఓ బి సి మండల అధ్యక్షులు చల్ల మల్లయ్య, కోమటి రవి ప్రస్తుత సర్పంచులు మాజీ ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు సొసైటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.



## రోజూ గంటల తరబడి కంప్యూటర్ కీబోర్డుపై టైప్ చేస్తున్నారా అయితే ఈ విషయాలను తెలుసుకోవాల్సిందే



డిజిటల్ యుగంలో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు లేకుండా రోజువారీ జీవితం ఊహించలేని స్థితికి చేరుకుంది. ఉద్యోగులు, విద్యార్థులు, గేమర్లు, కంటెంట్ క్రియేటర్లు ఇలా చాలా మంది రోజులో గంటల తరబడి టైపింగ్, స్క్రోలింగ్, క్లికింగ్ చేస్తూ గడుపుతున్నారు. బయటికి చూస్తే డెస్క్ పని శారీరకంగా కష్టమైన పని కాకపోయినా, చేతులు, మణికట్టుపై పడే నిరంతర ఒత్తిడి కాలక్రమేణా తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా యువతలో ఈ సమస్యలు వేగంగా పెరుగుతున్నాయని చెబుతున్నారు. నిరంతరం టైపింగ్ చేయడం, మౌస్ ఉపయోగించడం వల్ల రోజుకు వేల సంఖ్యలో చిన్నచిన్న కదలికలు చేతులు, మణికట్టు, వేళ్లపై ప్రభావం చూపుతాయి. పరిశోధనల ప్రకారం కంప్యూటర్‌ను ఎక్కువసేపు ఉపయోగించే వారు గంటకు 18 వేలకుపైగా కీ స్ట్రోక్స్ చేస్తుంటారు. ఈ పునరావృత కదలికలు కండరాలు, టెండన్లు, నరాలపై అధిక ఒత్తిడిని కలిగిస్తాయి. ముఖ్యంగా మణికట్టును వంచి పనిచేయడం లేదా సరైన సపోర్ట్ లేకుండా టైపింగ్ చేయడం వల్ల సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

### ఎలాంటి సమస్యలు వస్తాయి..

డెస్క్ పనికి సంబంధించిన సాధారణ సమస్యల్లో కార్పల్ టన్నెల్ సిండ్రోమ్, టెండనైటిస్, ట్రిగ్గర్ ఫింగర్, టెన్నిస్ ఎల్బో, మణికట్టు నొప్పులు, బొటనవేలి ఒత్తిడి గాయాలు, నరాల ఒత్తిడి సమస్యలు ఉన్నాయి. ఇవి మొదట చిన్న అసౌకర్యంలా ప్రారంభమైనా, నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలిక నొప్పులకు దారితీస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్యలకు కొన్ని ప్రారంభ సంకేతాలు కూడా ఉంటాయి. వేళ్లలో చిమ్మటలు లేదా మొద్దుబారిన భావన, మణికట్టు నొప్పి, బొటనవేలి అసౌకర్యం, వస్తువులను గట్టిగా పట్టుకోలేకపోవడం, ముందరిచేయిలో మంట, వేళ్లు క్లిక్ అవడం లేదా లాక్ అవడం, టైపింగ్ సమయంలో నొప్పి, రాత్రిళ్లు చేతులు మొద్దుబారడం వంటి లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త అవసరమని సూచిస్తున్నారు. సమస్యను తొందరగా గుర్తిస్తే శాశ్వత నష్టం తప్పించుకోవచ్చు. కానీ లక్షణాలు ఉన్నప్పటికీ అదే విధంగా పని కొనసాగిస్తే పరిస్థితి మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా కార్పల్ టన్నెల్ సిండ్రోమ్ వంటి నరాల ఒత్తిడి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే చేతి బలహీనత, కండరాల క్షీణత, పట్టుదల తగ్గడం, వేళ్ల సమన్వయం కోల్పోవడం వంటి దీర్ఘకాలిక సమస్యలకు దారితీస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

### ఎర్గోనామిక్ డివైస్‌లను వాడాలి..

ఇప్పటి వరకు ఈ సమస్యలు ఎక్కువగా వయసు పైబడిన ఉద్యోగుల్లో కనిపించేవి. కానీ ఇప్పుడు యువతలో కూడా వేగంగా పెరుగుతున్నాయి. గంటల తరబడి ల్యాప్‌టాప్ వినియోగం, మొబైల్ స్క్రోలింగ్, వీడియో గేమ్స్, సరైన ఫర్నిచర్ లేకుండా వర్క్ ఫ్రం హోమ్, శారీరక చలనం తగ్గడం వంటివి దీనికి ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. ఈ సమస్యలను నివారించడంలో సరైన ఎర్గోనామిక్స్ కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. టైపింగ్ సమయంలో మణికట్టును నేరుగా ఉంచడం, కీబోర్డ్, మౌస్‌ను మోచేతి స్థాయిలో ఉంచడం, చేతులకు సపోర్ట్ ఇచ్చే కుర్చీలను ఉపయోగించడం, స్క్రీన్‌ను కళ్ల స్థాయిలో ఉంచడం, నిటారుగా కూర్చోవడం వంటి అలవాట్లు ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. అవసరమైతే ఎర్గోనామిక్ కీబోర్డులు, ప్రత్యేక మౌస్ పరికరాలు ఉపయోగించడం కూడా ఉపయోగకరమని చెబుతున్నారు. పని మధ్యలో విరామాలు తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. గంటల తరబడి నిరంతర టైపింగ్ వల్ల కండరాలు, టెండన్లు విశ్రాంతి పొందలేవు. ప్రతి 45 నుంచి 60 నిమిషాలకు చిన్న విరామం తీసుకోవడం, వేళ్లు, మణికట్టుకు స్ట్రెచింగ్ చేయడం, మెడ, భుజాలను కదలించడం, టైపింగ్ సమయంలో అధిక ఒత్తిడి పెట్టకుండా ఉండడం వల్ల సమస్యలను తగ్గించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

### ఈ లక్షణాలు ఉంటే జాగ్రత్త..

చేతుల బలహీనత, నిరంతర నొప్పి, నిద్రలో కూడా చేతులు మొద్దుబారడం, విశ్రాంతి తీసుకున్నా సమస్య తగ్గకపోవడం వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. అవసరమైతే నర్వ్ స్టడీస్, స్కాన్లు చేసి సమస్య తీవ్రతను గుర్తిస్తారు. చికిత్సలో ఫిజియోథెరపీ, మణికట్టు సపోర్ట్, మందులు, జీవనశైలి మార్పులు, తీవ్రమైన పరిస్థితుల్లో శస్త్రచికిత్స కూడా అవసరమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. డెస్క్ పని బయటికి తేలికగా కనిపించినా, దీర్ఘకాలంలో చేతులు, ఇణికట్టు ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపిస్తుంది. అయితే సరైన భంగిమ, క్రమం తప్పని విరామాలు, వ్యాయామం, సమయానికి వైద్య సలహా తీసుకోవడం ద్వారా ఈ సమస్యలను చాలా వరకు నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# పెద్ది మూవీ జపాన్‌లో విడుదల లేనట్లే



గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన పాన్ ఇండియా స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా పెద్దిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ చిత్రాన్ని ఆసక్తిగా ఎదురుచూస్తున్న జపాన్ అభిమానులకు ఇప్పుడు ఊహించని షాక్ తగిలింది. మొదట్లో చిత్రబృందం పెద్ది సినిమాను భారతదేశంతో పాటు జపాన్‌లో కూడా అదే రోజున విడుదల చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. గతంలో ఆర్ఆర్ఆర్ సినిమా జపాన్‌లో భారీ విజయం సాధించడంతో అక్కడ రామ్‌చరణ్‌కు మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఏర్పడింది. ఆ సినిమా ద్వారా ఆయన నటనకు జపాన్ ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. దీంతో పెద్ది సినిమాను కూడా జపాన్‌లో ఒకేసారి విడుదల చేస్తే మంచి స్పందన వస్తుందని నిర్మాతలు భావించినట్లు తెలుస్తోంది. జపాన్ అభిమానులు కూడా ఈ వార్తతో ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. అయితే విడుదలకు కొద్ది రోజుల ముందు చిత్రబృందం కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కొన్ని అనివార్య కారణాల వల్ల జపాన్‌లో పెద్ది సేమ్ డే రిలీజ్‌ను నిలిపివేసినట్లు తెలుస్తోంది. దీంతో జూన్ 4న సినిమా అక్కడ విడుదల కాన్లటైంది. ఈ వార్తతో జపాన్‌లోని రామ్‌చరణ్ అభిమానులు తీవ్ర నిరాశకు గురైనట్లు తెలుస్తోంది. అలాగే అక్కడ నివసిస్తున్న భారతీయ ప్రేక్షకులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఒకవేళ అదే రోజు విడుదల జరిగి ఉంటే అంతర్జాతీయ బాక్సాఫీస్ వద్ద భారీ స్థాయిలో కలెక్షన్లు నమోదు అయ్యే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక పెద్ది చిత్రంలో రామ్‌చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు.

## కమల్‌హాసన్‌ను కలిసిన భాగ్యశ్రీ భోర్సే



కోలీవుడ్ నటుడు శివ కార్తికేయన్ 'సెయాన్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కమల్ హాసన్ సొంత నిర్మాణసంస్థపై ఈ సినిమా రానుంది. ఇందులో హీరోయిన్‌గా నటిస్తోన్న భాగ్యశ్రీ బోర్సే తాజాగా కమల్‌ను కలిశారు. ఆయనతో దిగిన ఫొటోలను పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. డియర్ కమల్ హాసన్ సర్.. చిన్నప్పటినుంచి మిమ్మల్ని చూస్తూ పెరిగాను. ఇప్పుడు ఆ చిన్న అమ్మాయి మీ సినిమాలో నటిస్తోంది. మీరు నా తలపై చేయి వేసి ఆశీర్వదించిన క్షణాలను వర్ణించడానికి మాటలు సరిపోవు. మీరు గర్వపడేలా చేస్తానని ప్రామిస్ చేస్తున్నా అని భాగ్యశ్రీ పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటో, ఆమె పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'అమరన్' విజయం తర్వాత శివకార్తికేయన్.. కమల్‌హాసన్ సొంత నిర్మాణసంస్థలో చేస్తున్న రెండో చిత్రమిది. శివకుమార్ మురుగేశన్ తెరకెక్కిస్తున్నారు. 'ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే సినిమా. కుటుంబ ప్రేక్షకుల్ని అలరించే భావోద్వేగాలు, మాస్ యాక్షన్, వినోదాన్ని మిళితం చేసుకుని ఉంటుందని టీమ్ తెలిపింది. ఈ సినిమా అక్టోబరులో థియేటర్లలోకి రానుంది.

## సమ్మర్ హాలిడేస్ టీజర్ విడుదల




ఏ మిడిల్ క్లాస్ బయోపిక్'తో అందరికీ చేరువయ్యాడు నటుడు రోహన్. ఈ సమ్మర్‌లో మరోసారి నవ్వులు పంచేందుకు వచ్చేశాడు. రోహన్, అరుణ్ ప్రధానపాత్రల్లో రానున్న చిత్రం 'సమ్మర్ హాలీడేస్'. శ్రీకర్ నాయన్ తెరకెక్కిస్తున్నారు. జయసుధ, వాసుకీ ఆనంద్, రాజీవ్ కనకాల కీలకపాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను చిత్ర బృందం పంచుకుంది.

# రాబోయే విద్యా సంవత్సరానికి గురుకులాలు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క





- గురుకుల పాఠశాలల్లో ప్రతి సీటు భర్తీ కావాలి...నిర్లక్ష్యానికి తావులేదు
- సీట్లు భర్తీ కాని పాఠశాలలపై ప్రత్యేక అధ్యయనం చేసి సమస్యలు పరిష్కరించాలి..
- ప్రతి రెసిడెన్షియల్ స్కూల్‌కు జిల్లా అధికారిని ఇన్‌చార్జిగా నియమించాలి..
- వైద్యులు ప్రతి నెల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలి..
- పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు విద్యార్థులకు సకాలంలో అందించాలి..
- గురుకుల స్వంత భవనాల్లో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలి..
- గురుకుల, సంక్షేమ వసతి విద్యాసంస్థలపై సమీక్షించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క..

ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 27 (అక్షరం న్యూస్)

రాబోయే విద్యా సంవత్సరానికి గురుకులాలు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్ లో బుధవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టీ విక్రమార్క జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్., అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సంబంధిత అధికారులతో కలిసి గురుకుల, సంక్షేమ వసతి విద్యాసంస్థలపై సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సంవత్సరం గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సీట్లు పూర్తిగా భర్తీ కాని రెసిడెన్షియల్ పాఠశాలలపై ప్రత్యేకంగా అధ్యయనం చేసి కారణాలు గుర్తించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని వసతి విద్యా సంస్థలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని తెలిపారు. వేసవి కాలంలోనే అవసరమైన మరమ్మతులు, మౌళిక వసతుల పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలలో డైట్ ఛార్జీలు, మెనూ వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించాలని తెలిపారు. ప్రతి గురుకుల విద్యాసంస్థకు ఒక జిల్లా అధికారిని ఇన్‌చార్జిగా నియమించి, వారు ప్రతి నెల పాఠశాలలను సందర్శించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు రెగ్యులర్‌గా పాఠశాలలను సందర్శించి తనిఖీ నివేదికలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. వైద్యులు కూడా ప్రతి నెల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలని తెలిపారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాల పరిస్థితిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన మరమ్మతులు నిరంతరం చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనాల పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో ఎన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయో, యంగ్ ఇండియా పాఠశాలలు పూర్తయ్యాక ఎన్ని తరలించవచ్చో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.



ప్రాంతీయ సమన్వయకర్తలు వచ్చే 12 రోజుల్లో అన్ని పాఠశాలలను చెక్‌లిస్ట్ ప్రకారం పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరానికి పాఠ్యపుస్తకాలు, యూనిఫాం లు విద్యార్థులకు సకాలంలో అందించడాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యపై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, భారీగా నిధులు వెచ్చిస్తున్న నేపథ్యంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. సిబ్బంది జీతాలు, డైట్ ఛార్జీలు, అద్దెల చెల్లింపులు ప్రభుత్వం క్రమం తప్పకుండా చెల్లిస్తున్నదని తెలిపారు. మరమ్మతుల నిధులు కూడా విడుదల చేస్తున్న నేపథ్యంలో పనులు క్షేత్రస్థాయిలో వేగంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పనుల బిల్లులు అధికంగా క్లియర్ చేసినట్లు తెలిపారు. విద్యాశాఖ పనుల బిల్లుల చెల్లింపులకు డీఎంఎఫ్‌టీ నిధులను కూడా వినియోగిస్తామని చెప్పారు. విద్యా సంస్థ లకు ఉచిత విద్యుత్ అందుతున్న నేపథ్యంలో స్వంత భవనాల్లో నడుస్తున్న గురుకులాల్లో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు కోసం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో గురుకులాల ప్రాంతీయ సమన్వయకర్తలు, ఎస్‌ఈ, ఎన్పిడిసిఎల్ శ్రీనివాస్, విద్యా శాఖ సంబంధిత అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ట్రోలర్స్‌ను పెద్దగా పట్టించుకోను







రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదలకు సిద్ధమవుతోంది. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. చిత్ర బృందం ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రమోషన్స్‌తో బిజీగా ఉండగా, ఇటీవల జరిగిన కొన్ని ఈవెంట్లలో రామ్ చరణ్ మాట్లాడిన తీరు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. కొన్ని సందర్భాల్లో పేర్లు మర్చిపోవడం, బెంగళూరు ఈవెంట్ లో కొద్దిగా కన్నడలో మాట్లాడటం వంటి అంశాలపై కొందరు సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు దిగారు. ఈ నేపథ్యంలో 'పెద్ది' చిత్రంలో అప్పలసూరి అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్న జగపతి బాబు తాజాగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రామ్ చరణ్‌పై జరుగుతున్న ట్రోలింగ్‌తో పాటు తనపై గతంలో వచ్చిన విమర్శలపైనా స్పందించారు. ట్రోలింగ్ చేసే వాళ్ల గురించి నేను పెద్దగా పట్టించుకోను. పనిలేని వాళ్లు ఎవ్వరినైనా కిందకి లాగాలనే ఉద్దేశంతో ఇలాంటి పనులు చేస్తుంటారు. చరణ్ ఈ సినిమా కోసం ఎంత కష్టపడ్డాడు, ఎన్ని గాయాలు అయ్యాయి, ఎంత శ్రమించాడు అనే విషయాలను పక్కనపెట్టి చిన్న విషయాలను పట్టుకుని పెద్దదిగా చేస్తున్నారని అన్నారు. అలాగే ఒక పెద్ద సినిమా ప్రమోషన్స్ సమయంలో హీరోలపై ఎంత ఒత్తిడి ఉంటుందో కూడా ఆయన వివరించారు. ఒకవైపు డబ్బింగ్ పనులు, మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్, సెన్సార్, థియేటర్ల వ్యవహారాలు.. ఇలా ఎన్నో బాధ్యతలు ఒకేసారి ఉంటాయి. ఆ ఒత్తిడిలో చిన్న చిన్న విషయాలు మర్చిపోవడం సహజం. నేను కూడా చాలా సందర్భాల్లో మర్చిపోతాను. అలాంటివాటిని పట్టుకుని ట్రోల్ చేయడం సరికాదు అని వ్యాఖ్యానించారు. ఇక తనపై గతంలో వచ్చిన ట్రోలింగ్‌పై కూడా ఆయన స్పందించారు. ఒక సీన్ కోసం నేను 70 లేదా 80 టేక్స్ తీసుకున్నానని సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. కానీ అందులో ఎలాంటి నిజం లేదు. ఎక్కువలో ఎక్కువ మూడు టేక్స్ తీసుకుని ఉంటాను. పూర్తిగా ఫేక్ సమాచారంతో ట్రోలింగ్ చేశారని స్పష్టం చేశారు.

# సన్‌రైజర్స్‌ను ముంచిన వైభవ్, ఆర్చర్..

## క్వాలిఫయర్ 2లో రాజస్థాన్..!



ఓపెనర్ల నుంచి ఆరో బ్యాటర్ వరకూ అందరూ దంచికొట్టగల సమర్థులే. ఇదివరకే తమ వైల్డ్‌ఫైర్ ఆటతో ఐపీఎల్ రికార్డు స్కోర్‌ను షేక్ చేసిన రికార్డు ఉండనే ఉంది. ఇంకేముంది ఎలిమినేటర్‌లో 244 పరుగుల లక్ష్యాన్ని సన్‌రైజర్స్ హైదరాబాద్ ఉఫ్‌మనిపిస్తుందనుకుంటే.. అనూహ్యంగా కుప్ప కూలింది. పదిహేనేళ్ల వైభవ్ సూర్యవంశీ(97) ఊచకోతతో డీలా పడిన హైదరాబాద్‌ను జోఫ్రా ఆర్చర్(58-3) పవర్ ప్లేలోనే పడగొట్టాడు. ఓపెనర్లను ఇషాన్(33) ఔట్ చేసి మ్యాచ్‌ను రాజస్థాన్ వైపు తిప్పాడు. నితీశ్ రెడ్డి(38) కాసేపు నిలబడినా ఆరెంజ్ ఆర్మీ ఘోర ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించింది. అదిరే విక్టరీ కొట్టిన రాజస్థాన్ మే 29న క్వాలిఫయర్ 2లో గుజరాత్ టైటాన్స్‌ను ఢీకొట్టనుంది.

చావోరేవో పోరులో బ్యాటర్లు, బౌలర్ల వైఫల్యంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇంటిదారి పట్టింది. ఎలిమినేటర్‌లో చెత్తాటతో రెండో టైటిల్ వేటను నాకౌట్ దశలోనే ముగించింది. ప్లాన్ ఏ, ప్లాన్ బీ, ప్లాన్ సీ ఉందన్న కమిన్స్ సేనకు వణుకు పుట్టిస్తూ వైభవ్ సూర్యవంశీ(97) సిక్సర్ల మోతతో భారీ స్కోర్ కొట్టిన రాజస్థాన్.. ఆర్చర్(58-3) నిప్పులు చెరగడంతో పవర్ ప్లేలోనే మ్యాచ్‌ను తమ గుప్పిట్లోకి తీసుకుంది. టాపార్డర్ కూలినా.. క్లాసెన్(18) ఉన్నాడులే అనే సన్‌రైజర్స్ ధైర్యాన్ని యశ్ పంజా లాగేసుకున్నాడు. క్లాసెన్‌ను అతడు ఎల్బీగా ఔట్ చేయగా ఓటమి ఖాయమైంది. భారీ విజయంతో క్వాలిఫయర్‌కు 2కు దూసుకెళ్లింది.



### అభిషేక్ డకౌట్

ప్లే ఆఫ్స్‌లో ఓడితే మరో అవకాశం ఉండదని తెలిసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ పేలవ ప్రదర్శనకు మూల్యం చెల్లించుకుంది. 244 పరుగుల లక్ష్యం పెద్దది కావడంతో దూకుడుగా ఆడి తలొక అర్ధ శతకంతో గెలిపిస్తారనుకుంటే టాపార్డర్ బ్యాటర్లు చేతులెత్తేశారు. అందుకు కారణం ఆదిలోనే సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను జోఫ్రా ఆర్చర్(58-3) గట్టి దెబ్బ కొట్టడమే. ఓపెనర్ అభిషేక్ శర్మ(0)ను రెండో బంతికే డకౌట్ చేసిన అతడు.. సిక్సర్లతో వేగంగా ఆడుతున్న ఇషాన్ కిషన్(33)ను స్లో బంతితో బోల్తా కొట్టించాడు. బ్యాటింగ్ ఆర్డర్లో ముందొచ్చిన స్మరణ్ రవిచంద్రన్(1) బంతిని అంచనా వేయలేక బర్గర్ ఓవర్లో వెనుదిరిగాడు.

టపటపా మూడు వికెట్లు పడిన వేళ.. ట్రావిస్ హెడ్(17), హెన్రిచ్ క్లాసెన్(18)లు ఆచితూచి ఆడబోగా.. హెడ్‌ను బౌల్డ్ చేసిన ఆర్చర్ సన్‌రైజర్స్‌ను ఓటమి వైపు నడిపాడు. కీలక వికెట్లు పడినా క్లానెస్ జతగా తెలుగబ్బాయి నితీశ్ రెడ్డి(38) జట్టును గెలిపించాలనుకున్నాడు. కానీ, యశ్ రాజ్ పంజా వేసిన 7వ ఓవర్లో క్లాసెన్ ఎల్బీగా వెనుదిరిగగా 81 వద్దే సన్‌రైజర్స్ ఐదో వికెట్ పడింది. ఉన్నంతసేపు చూడచక్కని షాట్లు ఆడిన నితీశ్‌ను జడ్డూ.. కమిన్స్(1)ను సుశాంత్ ఔట్ చేయడంతో ఇంప్యాక్ట్ సబ్ సలీల్ అరోరా(35) కాసేపు పోరాడాడు. 47పరుగుల తేడాతో గెలుపొందిన పరాగ్ సేన మే 29న ఇదే మైదానంలో గుజరాత్‌తో అమీతుమీ తేల్చుకోనుంది.


### వైభవ్ పిడుగల్లే

ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ(97) రికార్డులను బద్ధలు కొడుతూ ఆడిన తుఫాన్ ఇన్నింగ్స్‌తో ఎలిమినేటర్‌లో రాజస్థాన్ రాయల్స్ కొండంత స్కోర్ చేసింది. ముల్లన్‌పూర్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పేస్ దళాన్ని వణికిస్తూ 16 బంతుల్లోనే అర్ధ శతకం బాదిన వైభవ్.. తృటిలో రికార్డు శతకాన్ని చేజార్చుకున్నాడు. అనంతరం ధ్రువ్ జురెల్(50) హాఫ్ సెంచరీతో రాణించగా 250 ప్లస్ కొట్టేలా కనిపించింది రాజస్థాన్. కానీ, డెత్ ఓవర్లలో 36 పరుగులే ఇచ్చిన హైదరాబాద్ ప్రత్యర్థిని 243కు కట్టడి చేసింది. మెరుపు అర్ధ శతకం బాదిన వైభవ్ ఒకే సీజన్‌లో క్రిస్ గేల్ పేరిట ఉన్న 59 అత్యధిక సిక్సర్ల రికార్డును అధిగమించాడు. ప్రస్తుతం అతడి ఖాతాలో 65 సిక్సర్లున్నాయి.

## మా ఊరి వాతావరణమే ఎల్లమ్మకు చేరువ చేసింది

బలగం వేణు దర్శకత్వం వహిస్తున్న ఎల్లమ్మలో హీరోగా దేవిశ్రీప్రసాద్ నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పార్ట్ మొదలయ్యింది. తాను కథానాయకుడిగా 'ఎల్లమ్మ' సినిమాని చేయడానికి స్ఫూర్తినిచ్చిన విషయాల్ని ఓ వీడియోతో పంచుకున్నారు దేవిశ్రీప్రసాద్. సంగీత దర్శకుడిగా సుపరిచితమైన ఆయన కథానాయకుడిగా 'ఎల్లమ్మ' సినిమాతో తెరకు పరిచయం అవుతున్న సంగతి తెలిసిందే. వేణు ఎల్దండి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై శిరీష్ నిర్మిస్తున్నారు. తెలుగుతోపాటు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల దేవిశ్రీ ప్రసాద్ తన స్వగ్రామమైన వెదురుపాకని సందర్శించి, ఆ ఊరి జాతర వేడుకల్లో భాగమయ్యారు. అందుకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఆ వీడియోలో ఆయన మాట్లాడుతూ 'మా నాన్న జన్మించిన ఊరు వెదురుపాక. ప్రకృతి, గ్రామీణ జీవన సౌందర్యం గురించి తెలుసుకోవాలని మా నాన్న చిన్నప్పుడు మమ్మల్ని తరచూ చెన్నై నుంచి వెదురుపాక తీసుకొచ్చేవారు. మా మూలాలతో, మనుషులతో అనుబంధం కొనసాగాలని ఇక్కడే ఓ అందమైన ఇల్లు కూడా నిర్మించుకున్నాం. సంస్కృతి, జానపద కళలు, దైవత్వం ఎంత అందమైనవో నాకు నేర్పిన ఊరు ఇదే. ఆ అనుభూతులే నేను 'ఎల్లమ్మ' సినిమా చేయడానికి స్ఫూర్తినిచ్చాయన్నారు.

# వరుసగా రెండో సీజన్‌లో ఫైనల్లోకి ఆర్సీబీ..



డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు అద్భుతం చేసింది. ఈ సీజన్ లో తొలిసారి ప్లే ఆఫ్స్ కు చేరిన జట్టుగా నిలిచిన ఆర్సీబీ.. తన రికార్డును నిలబెట్టుకుంటూ, ఫైనల్లోకి కూడా ప్రవేశించింది. ధర్మశాలలో మంగళవారం జరిగిన క్వాలిఫయర్ -1లో మాజీ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ పై 92 పరుగులతో ఘన విజయం సాధించి, వరుసగా రెండోసారి ఫైనల్లోకి ప్రవేశించింది. అంతకుముందు టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో ఆర్సీబీ 5 వికెట్లు 254 పరుగుల భారీ స్కోరు సాధించింది. క్వాలిఫయర్ మ్యాచ్ లో ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. రజత్ పతిదార్ కెప్టెన్ ఇన్నింగ్స్ (33 బంతుల్లో 93 నాటౌట్, 5 ఫోర్లు, 9 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. జాసన్ హోల్డర్, కగిసో రబాడ కు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం చేజింగ్ లో 19.3 ఓవర్లలో గుజరాత్ కేవలం 162 పరుగులకే ఆలౌటైంది. ఫినిషర్ రాహుల్ తెవాటియా సూపర్బ్ ఫిఫ్టీ (43 బంతుల్లో 68, 8 ఫోర్లు, 4 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచి, ఒంటరి పోరాటం చేశాడు బౌలర్లలో జేకబ్ డఫీ మూడు వికెట్లతో రాణించాడు. ఈ విజయంతో ఆర్సీబీ ఫైనల్ కు వెళ్లగా, జీటీ, క్వాలిఫయర్ 2కి పడిపోయింది. బుధవారం సన్ రైజర్స్ హైదరాబాద్ తో జరిగే మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ తలపడనుంది. ఈ మ్యాచ్ విజేతతో జీటీ తలపడుతుంది. ఇందులో గెలిచిన జట్టుతో ఫైనల్లో ఆర్సీబీ తలపడనుంది. భారీ టార్గెట్ తో బరిలోకి దిగిన గుజరాత్ కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగలింది. మూడు ఫోర్లు కొట్టి జోరు చూపించిన, ఆరెంజ్ క్యాప్ హోల్డర్, ఓపెనర్ సాయి సుదర్శన్ (14) ఆరంభంలోనే హిట్ వికెట్ గా ఔటయ్యాడు. ఆ తర్వాత క్రీజులో అసౌకర్యంగా కదిలిన కెప్టెన్ శుభమాన్ గిల్ (2)ను భువనేశ్వర్ కుమార్ బౌల్డ్ చేశాడు. ఈ దశలో జోస్ బట్లర్ (11 బంతుల్లో 29, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) ఎదురుదాడికి దిగడంతో జీటీ స్కోరు బోర్డు కాస్త పరుగులెత్తింది. తను రెండు కళ్లు చెదిరే సిక్సర్లు బాదాడు. అయితే కాసేపటికే తనను జోష్ హేజిల్ వుడ్ పెవిలియన్ కు పంపాడు. తర్వాతి ఓవర్లోనే నిశాంత్ సింధు (5) కూడా ఔట్ కావడంతో జీటీ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఇక పవర్ ప్లేలో 51 పరుగులు సాధించి, టార్గెట్ కు చాలా దూరంగా జీటి ఇన్నింగ్స్ సాగింది. ఆ తర్వాత కూడా వరుస విరామాల్లో వికెట్లను జీటీ కోల్పోయింది. వాషింగ్టన్ సుందర్ (8), జాసన్ హోల్డర్ డకౌట్ అవడంతో జీటీ కోలుకోలేక పోయింది. మరోవైపు వరుసగా వికెట్లు పడుతున్నా, తెవాటియా.. ఎదురు దాడికి దిగాడు. ఎనిమిది ఫోర్లు, నాలుగు సిక్సర్లతో రెచ్చిపోయాడు. తొమ్మిదో వికెట్ కు మహ్మద్ సిరాజ్ (5) తో కలిసి 68 పరుగులు జోడించాడు. ఇందులో సింహభాగం పరుగులను తెవాటియానే సాధించాడు. ఈ క్రమంలో 33 బంతుల్లో అర్ధ సెంచరీని తెవాటియా పూర్తి చేసుకున్నాడు. కాసేపటికే తను ఔట్ కావడంతో జీటీ ఇన్నింగ్స్ ముగిసింది. ఓవరాల్ గా డిఫెండింగ్ చాంపియన్ గా బరిలోకి దిగి, ఆర్సీబీ వరుసగా రెండోసారి ఫైనల్లోకి దూసుకు పోవడంపై ఆ జట్టు ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## అందుకే ప్రఫుల్ హింగేను తీసుకున్నాం: ప్యాట్ కమిన్స్

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో జరుగుతున్న ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని ా=న కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అన్నాడు. తుది జట్టులో ఒక మార్పు చేశామని చెప్పిన ప్యాట్ కమిన్స్.. ప్రఫుల్ హింగే తుది జట్టులోకి వచ్చాడని చెప్పాడు. టీమ్ వ్యూహంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. ఫైనల్స్ ఆడిన అనుభవం ఈ మ్యాచ్‌లో ఉపయోగపడుతుందా? అంటే అవునని చెప్పలేను. కానీ ఆ అనుభవంతో కాస్త రిలాక్స్ అవ్వచ్చు. కానీ అత్యుత్తమ క్రికెట్ ఆడాల్సిందే. మేం మా జోరును కొనసాగించాలనుకుంటున్నాం. మేం మా వ్యూహాలను అమలు చేసే ప్రయత్నం చేస్తాం. మా సహజమైన బలాలపైనే ఆధారపడుతాం. తుది జట్టులో ఒక మార్పు చేశాం. ప్రఫుల్ హింగే తుది జట్టులోకి వచ్చాడు.టాస్ గెలిస్తే బౌలింగ్ ఎంచుకోవాలని ముందుగా ఏం అనుకోలేదు. ఇక్కడ ఛేజింగ్‌కు అనుకూలంగా ఉంటుందని ఈ నిర్ణయం తీసుకున్నాం. టాస్‌కు అంత ప్రాధాన్యత ఇవ్వలేదు. టాస్ ఓడినా మాకు జరిగే నష్టం ఏం ఉండేది కాదు. మేం బంతితో ఈ మ్యాచ్‌ను ప్రారంభించాలనుకుంటున్నాం.'అని ప్యాట్ కమిన్స్ చెప్పుకొచ్చాడు.మరోవైపు టాస్ గెలిస్తే ఏం ఎంచుకోవాలనే విషయంలో తాము కూడా గందరగోళంగా ఉన్నామని రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ అన్నాడు. కానీ ముందుగా బౌలింగ్ ఎంచుకునేవాళ్లమని చెప్పాడు. 'ఈ మైదానంలో ఛేజింగ్ రికార్డ్ బాగుంది. ఆ రికార్డ్‌ను మార్చేందుకు ఇది మంచి సమయమని భావిస్తున్నా. ఈ మైదానంలో మాకు మంచి రికార్డు ఉంది. ఇక్కడ ఆడిన మూడు మ్యాచ్‌లకు మూడు గెలిచాం. ఇక్కడ లక్ష్యాలను ఛేదించడంతో పాటు డిఫెండ్ కూడా చేసుకున్నాం. ఈ సెంటిమెంట్‌ను అలానే కొనసాగించాలనుకుంటున్నాం.ఈ మ్యాచ్ ఆడటానికి నేను ఫిట్‌గా ఉన్నాను. తప్పక గెలవాల్సిన పరిస్థితి కాబట్టి కసిని పెంచవచ్చు.

## వరల్డ్ రికార్డులు బద్దలు కొట్టిన రన్ మెషీన్



ఐపీఎల్ 2026 క్వాలిఫైయర్ 1 మ్యాచ్ లో గుజరాత్ టైటాన్స్ పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి విధ్వంసకర బ్యాటింగ్ తో రెచ్చిపోయాడు. ఈ మ్యాచ్ లో కోహ్లీ కేవలం 25 బంతుల్లోనే 1 సిక్స్, 5 ఫోర్ల సహాయంతో 43 పరుగులు సాధించాడు. ఈ ఇన్నింగ్స్ తో ఆయన ఐపీఎల్ 2026 సీజన్ లో 600 పరుగుల మైలురాయిని అందుకున్నాడు. ఐపీఎల్ హిస్టరీలోనే వరుసగా నాలుగు సీజన్లలో 600 లేదా అంతకంటే ఎక్కువ పరుగులు చేసిన ఏకైక బ్యాటర్‌గా కోహ్లీ సరికొత్త రికార్డు సృష్టించాడు. అలాగే గుజరాత్ టైటాన్స్‌పై 500 పరుగుల మార్కును దాటడం ద్వారా, ఐపీఎల్ లో ఎనిమిది వేర్వేరు జట్లపై 500 కంటే ఎక్కువ పరుగులు చేసిన ఫస్ట్ ప్లేయర్‌గా నిలిచాడు. ఈ సీజన్ లో ఇప్పటివరకు ఆడిన 15 ఇన్నింగ్స్ లో కోహ్లీ 50.00 యావరేజ్, 164.38 అద్భుతమైన స్ట్రైక్ రేట్ తో 600 పరుగులు చేశాడు. ఆయన ఐపీఎల్ కెరీర్ లో ఒక సీజన్ లో నమోదైన బెస్ట్ స్ట్రైక్ రేట్ ఇదే కావడం విశేషం. ఇందులో ఒక సెంచరీ, నాలుగు హాఫ్ సెంచరీలు ఉండగా బెస్ట్ స్కోరు 105లి పరుగులుగా ఉంది. 2022 సీజన్ లో కేవలం 341 పరుగులకే పరిమితమై ఫామ్ లేమితో ఇబ్బంది పడ్డ కోహ్లీ, ఆ తర్వాత టి20 క్రికెటర్ గా తనను తాను రీఇన్వెంట్ చేసుకున్న తీరు అసాధారణం. వయసు పెరుగుతున్నా, అంతర్జాతీయ టి20ల నుండి రిటైర్ అయినా ఐపీఎల్ లో ఆయన గ్రాఫ్ ఏమాత్రం తగ్గలేదు.కోహ్లీ కంబ్యాక్ జర్నీ 2023 సీజన్ లో 639 పరుగులతో గ్రాండ్‌గా స్టార్ట్ అయింది. ఆ ఏడాది రెండు సెంచరీలు, ఆరు హాఫ్ సెంచరీలతో టోర్నమెంట్‌లో ఫోర్త్ హైయెస్ట్ రన్ గెట్టర్‌గా నిలిచాడు. ఆ తర్వాత సీజన్ లో స్పిన్నర్లపై తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శిస్తూ ఏకంగా 741 పరుగులు సాధించి ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్నాడు. ఆ సీజన్ లో 38 సిక్సర్లు బాదడం విశేషం. ఇక గత సీజన్ లో ఆర్‌సీబీ టైటిల్ విన్నర్ గా నిలవడంలో కోహ్లీ కీలక పాత్ర పోషించాడు. కఠినమైన కండిషన్స్ లో అడాప్టబిలిటీ చూపిస్తూ 15 ఇన్నింగ్స్ లో 8 హాఫ్ సెంచరీలతో 657 పరుగులు చేసి టీమ్ ను ముందుండి నడిపించాడు.ఈ ప్రతిష్టాత్మక క్వాలిఫైయర్ 1 మ్యాచ్ లో టాస్ గెలిచిన గుజరాత్ టైటాన్స్ మొదట ఫీల్డింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో ఆర్సీబీ 5 వికెట్లు 254 పరుగుల భారీ స్కోరు సాధించింది. క్వాలిఫయర్ మ్యాచ్ లో ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. రజత్ పతిదార్ కెప్టెన్ ఇన్నింగ్స్ (33 బంతుల్లో 93 నాటౌట్, 5 ఫోర్లు, 9 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. జాసన్ హోల్డర్, కగిసో రబాడ కు రెండేసి వికెట్లు దక్కాయి.

## రాజా రణధీర్ కన్నుమూత



భారత మాజీ షూటర్, ఒలింపియన్ రణధీర్ సింగ్ (79) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యం తో బాధపడుతున్న రణధీర్ బుధవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. రణధీర్ మరణాన్ని నేషనల్ రైఫిల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శి రాజీవ్ భాటియా ధ్రువీకరించారు. భారత క్రీడా రంగంలో రాజా రణధీర్? చెరగని ముద్ర వేశారు. ఆయన మరణంతో క్రీడా లోకం దిగ్భ్రాంత్రికి గురైంది. పంజాబ్‌లోని పాటియాలా రాజ కుటుంబంలో రణధీర్ సింగ్ జన్మించారు. ఆయనకు భార్య వినిత, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అందులో చిన్న కుమార్తె రాజేశ్వరి కూడా ఒక షూటర్ కావడం విశేషం. అయితే కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆరోగ్య సమస్యల కారణంగానే ఇటీవల ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా (ాజూా) అధ్యక్ష పదవికి ఆయన రాజీనామా చేశారు. ఇక బుధవారం ఢిల్లీలోని ఆయన నివాసంలోనే కన్నుమూశారు. రణధీర్ తన కెరీర్‌లో అనేక ప్రధాన మైలురాళ్లు సాధించారు. 1978 ఆసియా క్రీడల్లో ట్రాప్ ఈవెంట్‌లో అగ్రస్థానంలో నిలిచారు. దీంతో భారత్ తరఫున స్వర్ణ పతకం గెలిచిన భారత తొలి షూటర్‌గా రణధీర్ సింగ్ చరిత్ర సృష్టించారు. బ్యాంకాక్ వేదికగా జరిగిన ఈ క్రీడల్లో ట్రాప్ ఈవెంట్‌లో చరిత్రాత్మక స్వర్ణ పతకం గెలిచి దేశానికి గర్వకారణంగా నిలిచారు.ఆ తర్వాత క్రమంగా గొప్ప షూటర్లలో ఒకరిగా ఎదిగారు. ఆయన రికార్డు స్థాయిలో ఐదు ఒలింపిక్ క్రీడల్లో భారత్?కు ప్రాతినిధ్యం వహించారు. ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియాకు రణధీర్ 1991 నుంచి 2015 వరకు సెక్రటరీ జనరల్‌గా సేవలందించారు. ఇక 2024 సెప్టెంబర్‌లో ఢిల్లీలో జరిగిన ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా 44వ సర్వసభ్య సమావేశంలో రణధీర్ సింగ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. దీంతో అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి భారతీయుడిగానూ నిలిచారు. ఈ పదవిలో రణధీర్ 2028 దాకా ఉండాల్సింది. అయితే, ఈ ఏడాది ప్రారంభంలో ఆరోగ్యం క్షీణించడం వల్ల ఆయన పదవికి రాజీనామా చేశారు. రణధీర్ సింగ్ భారత, ఆసియా క్రీడా సంస్థలలో వివిధ పరిపాలనా పదవులను కూడా నిర్వహించారు. ఆయన 1987 నుంచి 2012 వరకు ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్‌గా పనిచేశారు. అదనంగా, రణధీర్ 2001 నుంచి 2014 వరకు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ లో సభ్యుడిగా ఉన్నారు. రణధీర్ సింగ్ షూటింగ్ క్రీడల అభివృద్ధికి, ఒలింపిక్ ఉద్యమానికి అమూల్యమైన కృషి చేశారు. రణధీర్ విశిష్ట క్రీడా జీవితంలో 5 ఒలింపిక్ క్రీడలలో పాల్గొనడం, 1978లో బ్యాంకాక్‌లో జరిగిన ఆసియా క్రీడలలో ట్రాప్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం సాధించడం వంటివి ఆయన కెరీర్?లో అత్యుత్తమ మైలురాళ్లు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers,
RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609